ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్
గురువారం 31 ఆగస్టు 2017 | 20



'మిషన్ భగీరథ' పనుల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

మిషన్ భగీరథ పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలోగా ఇంటింటికి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాలో చేపడుతున్న మిషన్ భగీరథ పనులపై కలెక్టర్ దివ్య, ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

వివరాలు 7లో..





ఆడబిడ్డకు.. బతుకమ్మ కట్నం

- పండుగ సందర్భంగా ఆడపడుచులకు చీరలు
- 18 నుంచి చీరల పంపిణీ
- రేషన్ కార్డు ఉన్నవారే అర్హులు
- 598 రేషన్‌దుకాణాల ద్వారా చీరల అందజేత
- జిల్లావ్యాప్తంగా 2.99 లక్షల మందికి మహిళలకు లబ్ధి
- గ్రామానికి ముగ్గురు చొప్పున పర్యవేక్షణ
- చీరల పంపిణీ అత్యధికంగా వికారాబాద్‌లో, అత్యల్పంగా యాలాల్‌లో..

7 లో

తెలంగాణా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పల్లె, పట్నం అనే తేడా లేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకునే మహోత్తర పండగ బతుకమ్మ. ఈసారి ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు సర్కార్ మరో అడుగు ముందుకేసింది. కులమతాలకతీతంగా అన్ని వర్గాల మహిళలకు బతుకమ్మ పండుగకు చీరలను కానుకగా ఇవ్వనుంది. మహిళలను గౌరవించేందుకు చీర, జాకెట్‌ను అందించే కొత్త పథకానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 2.99లక్షల మంది ఆడపడుచులకు చీరలను పంపిణీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. జిల్లాలోని 598 రేషన్ దుకాణాల ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు బతుకమ్మ చీరలను అందించనున్నారు. సెప్టెంబర్ మొదటివారంలో జిల్లాకు చేరనున్న చీరలను మండల కేంద్రాల్లోని ప్రత్యేక గోడౌన్‌లలో నిల్వ చేసి వచ్చేనెల 18 నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





ఒంటికి నిప్పంటించుకున్న అయ్యూబ్‌ఖాన్

అయ్యూబ్‌ఖాన్ (ఫైల్)

నామినేటెడ్ పదవి దక్కలేదని..

- టీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్ ఆత్మహత్యాయత్నం
- కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి
- ఒంటికి నిప్పంటించుకుని సమావేశ మందిరంలోకి వచ్చే ప్రయత్నం
- మంటలార్పిన టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, పోలీసులు
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు

3

వివరాలు 7లో..



రాకంచర్లలో భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఫైరింగ్ రేంజ్ కోసం భూముల పరిశీలన

గులాబీ కోటలో కలకలం

10 నామినేటెడ్ పదవులు దక్కక నిర్వేదం

ప్రీపెయిడ్ మీటర్లు.. వచ్చేస్తున్నాయ్!

- వినియోగదారుడు ముందు డబ్బులు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా
- దుర్వినియోగానికి అడ్డుకట్టపడే అవకాశం
- మొండి బకాయిలకు చెక్ పెట్టేందుకు విద్యుత్‌శాఖ చర్యలు
- త్వరలో అమలుకు సర్కార్ యోచన

10 లో



ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

సీపీఎస్ రద్దుకు..

ఉద్యమం ఉధృతం

- రేపు జిల్లా కలెక్టరేట్ ముట్టడి
- పెన్షన్ విద్రోహ దినం, నల్లబ్యాడ్జీలతో నిరసన
- ధర్నాను విజయవంతం చేయాలి
- టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : సీపీఎస్ రద్దు కోసం అన్ని ఉద్యోగ సంఘాలను కూడగట్టుకుని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నాం. ఎన్నో ఏళ్ల నుంచి సీపీఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారింది. కంట్రిబ్యూటరీ (సీపీఎస్) పెన్షన్ పథకం రద్దు చేసి పాత పెన్షన్ (ఓపీఎస్) పథకాన్ని అమలు చేయాలి. ఇందుకోసం సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నాం. అదే రోజున పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కలెక్టరేట్ వద్ద సామూహిక ధర్నాలు చేస్తున్నాం. ఒకటో తేదీనా నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులంతా సెలవు పెట్టుకుని పెద్ద సంఖ్యలో హాజరు కావాలి. అందరం ఒక్కటై పిడికిలి బిగించి ఉద్యమంలోకి దిగాల్సిన అవసరసరం ఉంది. మూడు దశాబ్దాల పాటు రెక్కలు ముక్కలు చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగి పదవీరణ చేస్తే. గ్రాట్యుటీ, పీఎఫ్ వచ్చేది. అలాగే ఇతర ప్రయోజనాలు దక్కేవి. దాంతో ఉద్యోగ, ఉపాధ్యాయ శేష జీవితం చీకూ చింత లేకుండా గడిచిపోయేది. పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఆందోళన చెందాల్సిన పడాల్సినపని ఉండేది కాదు. దురదృష్టవశాత్తు ఉద్యోగి ఒక వేళ మధ్యలోనే చనిపోయినా డెత గ్రాట్యుటీ/రిటైర్మెంట్ గ్రాట్యుటీ రూపంలో డబ్బులు అందేవి. దాంతో ఆ కుటుంబాలకు గతంలో ఓ భరోసా ఉండేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆ భద్రత కరువైంది. అందుకే వారు కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రాట్యుటీని మళ్లీ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. 2004 సెప్టెంబర్ 1నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలోకి వచ్చిన సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పింఛను విధానం) ప్రకారం.. సర్వీసు మొత్తం ఉద్యోగుల నుంచి మినహాయించుకున్న దానికి, ప్రభుత్వ వాటాను జతకలిపి, ఆ మొత్తం నుంచి కేవలం 60 శాతం మాత్రమే ఉద్యోగులకు తిరిగి ఇస్తారు. అందులోనూ మళ్లీ 30 శాతం మేరకు పన్ను కింద మినహాయించుకుంటారు. మిగిలిన 40 శాతాన్ని షేర్ మార్కెట్‌లో ప్రభుత్వమే పెట్టుబడులుగా పెడుతుంది. సదరు ఉద్యోగికి 70 సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాతే చెల్లిస్తారు. ఆలోగా మరణిస్తే... ఉద్యోగి కుటుంబానికి అందుతుంది. సీపీఎస్ పథకం ప్రకారం.. రిటైరయ్యే/మృతి చెందిన నాటికి జమ కూడిన మొత్తంలో 40 శాతం ఆయా కుటుంబాలకు అందాల్సి ఉంటుంది. కానీ పథకం ప్రారంభమై 13 ఏళ్లు గడిచినా, మార్గదర్శకాలు ఇప్పటి వరకూ రూపుదిద్దుకోలేదు. తెలంగాణలో 1.20 లక్షల మంది ఉద్యోగులు సీపీఎస్‌లో ఉన్నారు. గత పదేళ్లలో వీరిలో వెయ్యి మంది వరకు పదవీరణ (పర్మనెంట్ అయిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు) చేశారు. మరో 200 మంది మృతి చెందారు. వీరిలో ఏ ఒక్కరి కుటుంబానికి ఇంత వరకూ కనీసం ఒక్క రూపాయి కూడా అందలేదు. దీని కోసం తెలంగాణ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం గత ఏడాది ఆగస్టు 26న వినతి పత్రం అందజేసింది. దాంతో ఎట్టకేలకు ఫైలు కదిలినా.. ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుంటే... దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయాల్సి ఉంటుంది.

పడకేసిన పారిశుధ్యం

- ఎక్కడ చూసినా చెత్త, కుంటలను తలపిస్తున్న మురుగు
- ప్రజా ఆరోగ్యం గాలికి..

ఫోకస్



గాంధీనగర్‌లో పేరుకుపోయిన చెత్త

ఘట్‌కేసర్: అసలే వర్షాకాలం వర్షాలు పడటం వల్ల తాగునీటితో పాటు చెత్త చెదారంతో పరిసరాలు కలుషితమై జనాలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉన్నందున నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్న మేజర్ పంచాయతీ అయిన ఘట్‌కేసర్‌లో మాత్రం పారిశుధ్యం పడకేసింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి సరైన మురుగు కాలువలు లేక జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఘట్ కేసర్ పంచాయతీలోని గాంధీనగర్‌లో పరిశుభ్రత కొరవడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తు న్నారు. సరైన మురుగు కాలువలు లేక ఎక్కడ పడితే అక్కడ మురుగు నీరు ప్రవహించడంతో దుర్వావాసన వ్యాపిస్తూ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ముఖ్యంగా ఘట్‌కేసర్ పంచాయతీలో స్వచ్ఛభారత్ పేరుతో నిత్యం పారిశుద్ధ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేస్తూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. ఒక వార్డులో పరిసరాలను శుభ్రం చేస్తే తిరిగి అ వార్డును శుభ్రం చేయడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందో అయోమయ పరిస్థితి నెలకొన్నది. గాంధీనగర్ కాలని అపరిశుభ్రతకు నిలయంగా మారిందని నెలల తరబడి చెత్తగురించి పట్టించుకోకపోగ మురుగు కాలువల నిర్మాణంను మరిచి పోయారని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

ఇళ్ల ముందు నుంచే మురుగునీటి కాలువలు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుండటం వల్ల తమ సొంత ఖర్చులతో పైపు లు వేసుకోని రాకపోకలు సాగిస్తున్నామని పలువురు బాధితులు వాపోయారు. గాంధీనగర్, బాలాజీనగర్ లలోని కొంత భాగం మురుగునీరు గాంధీ నగర్‌కు చేరి అక్కడ ఓ కుంటగా మారింది. ఇక్కడే ఓ వ్యక్తి ఇళ్లు నిర్మించుకోని నగరంలో నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం అ ఇళ్ల వద్దకు వెళ్ళడానికి కనీసం దారి అయిన లేదు. దీపం మాదిరిగా చుట్టు మురుగునీరు చేరి భయంకర పరిస్థితి నెలకొన్నది. గాంధీనగర్ నుంచి ఎరిమల్లే వాగు వరకు మురుగు నీరు కాలువను ఏర్పాటు చేసినప్పటికి కాలువలో పెద్ద ఎత్తున గడ్డి పెరిగి మురుగునీరు ముందుకు వెళ్ళకుండా పరిసరాలలోనే కుంటగా మారింది. కుంటగా మారిన ప్రాంతం ప్రైవేటు లేఅవుట్ కావడం విశేషం. ముఖ్యంగా చెత్తను గాంధీనగర్ ప్రధాన రోడ్డులో ఉన్న రైల్వే ప్రహారి గోడ పక్కన వెస్తున్నారు. వేసిన చెత్త వర్షానికి చెల్లాచెదరై పందులు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తు న్నారు. తమ కాలనీలో పారిశుధ్య సమస్యలు రాజ్యమేలుతున్న ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కాలనీలోని వర్షం పడితే చాలు అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ వర్షపు నీరు, మురుగు నీరు చేరి చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. ఎక్కడ చూసిన నిర్మాణం లేని మురుగునీటి కాలువలు, పందుల స్వైర విహారం, అపరిశుభ్రతతో సతమతమౌతున్నామని వాపోయారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులకు వివరిస్తే ఇదిగో చేస్తే అదిగో చేస్తాం అంటూ నాలుగు సంవత్సరాలు కాలం వెల్లదీశారు. చివరి సంవత్సరంలోనైనా గాంధీనగర్‌లో అభివృద్ధి చెందుతుందో లేదో వేచి చూడాల్సిందేనని ప్రజలు నిట్టుర్సాతున్నారు.



ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు

ఎక్కడ చూసిన చెత్తే



ఘట్‌కేసర్ గాంధీనగర్ కాలనిలో ఎక్కడ చూసిన చెత్తే కనిపిస్తుంది. పేరుకుపోయిన చెత్తకుప్పలలో పందులు స్వైర విహారం చేస్తూ పరిసరాలను కలుషితం చేస్తున్నాయి. దీంతో జనాలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు.

- తన్నీరు హరీష్, గాంధీనగర్

రోజు స్వచ్ఛభారతే..



ఘట్‌కేసర్ సర్పంచ్ స్వచ్‌భారత్ పేరుతో పంచాయతీ సిబ్బందిని ఉపయోగించి పనులు చేయిస్తూ వ్యక్తిగత ప్రచారం పొందుతున్నారు తప్ప ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గాంధీనగర్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది.

- మీసాల సుధాకర్‌రావు, పంచాయతీ సభ్యుడు ఘట్‌కేసర్

పంచాయతీలో అన్ని సమస్యలే..



మేజర్ పంచాయతీ అయిన ఘట్‌కేసర్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా చెత్త, మురుగునీటి సమస్యలతో జనాలు సతమతమవుతున్నారు. సమస్యలను పరిష్కారంకు అధికారులు చర్యలు చేపట్టాలి.

-పల్లే సంజయ్‌గౌడ్, స్థానికుడు

ప్రజల ఇలవేల్పుగా పోలెపల్లి ఎల్లమ్మ దేవత

భక్తి

కొడంగల్: కొలిచిన వారికి కొంగు బంగారంగా వెలు గొందు తున్న పోలెపల్లి ఎల్లమ్మ దేవత నిత్య పూజలు అందుకుంటుంది. నియోజకవర్గంలోని కోస్గి మండల పరిధిలో గల పోలెపల్లి శివారులో స్వయంభూగా వెలిసిన ఎల్లమ్మ దేవత రోజు రోజుకు ప్రత్యేకతను చాటుకుంటుంది. రైతు పొలంలో చదును చేస్తున్న సమయంలో గుంటుకపై రాయిని ఉంచి సాయంత్రం వేళలో పొలం గట్టుపై వేయగా ఉదయం వెళ్లి చూసే సరికి పొలం మధ్యలోకి వచ్చి చేరడంతో ఆలయ నిర్మాణ పనులను చేపట్టినట్లు పూర్వీకులు చెబుతున్నారు. హిందువులు ఆరాధ్యదైవంగా భావించే ఎల్లమ్మ దేవతకు పూజా కార్యక్రమాలను ప్రతి శుక్ర, మంగళ, ఆదివారాల్లో చేపట్టడం చోటు చేసుకుంటుంది. జిల్లాలోనే అతి పెద్ద జాతరగా భక్త జన సందోహం మధ్య వారం రోజుల పాటు ప్రత్యేక పూజలతో పోలెపల్లి ప్రాంతం కిటకిటలాడుతోంది. పంటల సాగుతో ధాన్యం చేతికి వచ్చాక రైతులు ఎల్లమ్మ దేవతకు మేక పోతులు, కోడి పుంజులతో తమ మొక్కులను తీర్చుకుంటారు.



పోలెపల్లి ఎల్లమ్మ దేవత మూలవిరాట్

సామూహిక సెలువు పెట్టి

రేపటి దీక్షను విజయవంతం చేయాలి

ఉద్యోగపర్వం

బషీరాబాద్ : సెప్టెంబర్ 1న సీపీఎస్ విధానం రద్దు కోసం వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే దీక్షకు సీపీఎస్ ఉపాధ్యాయులు, ఓపీఎస్ ఉద్యోలందరూ సామూహిక సెలవులు పెట్టి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయలని టీఎస్‌సీపీఎస్‌ఈఏ బషీరాబాద్ మండల అధ్యక్షుడు ముసవ్విర్ పిలుపునిచ్చారు. సీపీఎస్ విధానం ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో గుదిబండగా మారిందని ఈ విధానాన్ని రద్దుకు ముకుమ్మడిగా చేపట్టిన దీక్షకు అందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ సిస్టం అమలు పరిచేవరకు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పాత విధానం అమలు పరుస్తేనే పదవి విరమణ పొందిన ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా ఉంటుందన్నారు.



'సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి'

నవాబుపేట : సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 1న ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎస్ రద్దు కోసం ధర్నా నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షకార్యదర్శులు రామకృష్ణా రెడ్డి, గాలి నరహరి, ఉపాధ్యాయులు సంజీవరావు, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్

నామినేటెడ్ పదవి దక్కలేదని...
అయూబ్‌ఖాన్ ఆత్మహత్యాయత్నం

టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఘటన
ఒంటికి నిప్పంటించుకున్న అయూబ్‌ఖాన్
మంటలు ఆర్పిన నాయకులు, కార్యకర్తలు
అయూబ్‌ఖాన్ వెంటే హైదరాబాద్ వెళ్లిన మంత్రి మహేందర్‌రెడ్డి


గాయపడిన అయూబ్‌ఖాన్, జిల్లా ఆస్పత్రి వద్ద టీఆర్ఎస్ కార్యకర్తల హడావిడి

తాండూరు/తాండూరు రూరల్ : పదవి దక్కలేదనే మనోవేదనతో టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఆత్మహత్యాతయ్నం చేశాడు. బుధవారం సాయంత్రం తాండూరులోని సమద్‌ఫంక్షన్‌హాల్‌లో మంత్రి మహేందర్‌రెడ్డి హాజరైన కార్యకర్తల సమావేశం జరుగుతుండగా ఒంటికి నిప్పంటించుకుని వచ్చాడు. అప్రమత్తమైన కార్యకర్తలు, నాయకులు, పోలీసులు వెంటనే మంటలు ఆర్పి అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి...

తెలంగాణ ఉద్యమం ఆరంభం నుంచి టీఆర్ఎస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ అహర్నిశలు పనిచేసినా అధిష్టానం గుర్తింపు ఇవ్వలేదని కొంత కాలంగా అయూబ్‌ఖాన్ తీవ్ర మన స్థాపంతో ఉన్నట్లు తెలిసింది. నామినేటెడ్ పదవి విషయమై పలుమార్లు అధిష్టానాన్ని కోరాడు. ఆరునెలల క్రితం మంత్రి మహేందర్‌రెడ్డి ఇంట్లో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం జరగగా, అప్పట్లో అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు దక్కేలా చూస్తానని మంత్రి మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో నామినేటెడ్ పదవి వస్తుందని ఆశించిన అయూబ్ ఖాన్‌కు నిరాశే మిగిలింది. ఈ క్రమంలో తాం డూరు పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం టీఆర్ఎస్ పట్టణ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మంత్రి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో అయూబ్‌ఖాన్ కూడా పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పలువురు పార్టీ ప్రతినిధులు సమావేశ ప్రారంభంలో మాట్లాడుతుండగా, అయూబ్‌ఖాన్ స్టేజీవద్దకు వెళ్లి హైదరాబాద్ వెళ్లాలనీ, తనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరాడు. అనంతరం అతడు మాట్లాడుతూ 2004 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాననీ, ఇప్పటికీ టీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేస్తున్నాననీ, కానీ ఒక్క పదవి పొందలేదని భావోద్వేగంతో తెలిపాడు. అధిష్టానం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, పార్టీలో తనకు గుర్తింపు ఇవ్వడం లేదని అవేదన వ్యక్తం చేశాడు. అనంతం ప్రసంగాన్ని ముగించి బయటికి వెళ్లాడు. ఫంక్షన్ హాల్ గేటు వద్ద అక్కడ ముందుగానే తెచ్చుకున్న కిరోసిన్‌ను అయూబ్‌ఖాన్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని సమావేశం హాల్‌లోకి వచ్చాడు. ఇది గమనించిన టీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసులు వెంటనే అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే అయూబ్‌ఖాన్ ముఖభాగం, ఛాతి వరకు కొంత కాలిపోయింది. అక్కడే ఉన్న మంత్రి మహేందర్‌రెడ్డి, నాయకులు వెంటనే పోలీసు జీపులో తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం అతడిని అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. దీంతో మంత్రి మహేందర్‌రెడ్డి సమావేశాన్ని రద్దుచేసి అయూబ్‌ఖాన్ వెంట మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ వెళ్లిపోయారు. టీఆర్ఎస్ పార్టీ కోసం ఉద్యమంలో పాల్గొని ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సోంశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎందరో ఉద్యమకారులకు పార్టీ అధిష్టానం అనాది నుంచి పట్టించుకోవడం లేదనీ, పలువురి బతుకులు అరణ్యరోధనగా మారాయని ఆయన పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న అడవి పంది...
వ్యక్తి మృతి


దేవయ్య (ఫైల్‌ఫొటో)

నవాబుపేట : ద్విచక్ర వాహనాన్ని అడవి పంది ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నవాబుపేట మండల పరిధిలో బుధవారం జరిగింది. ఎకమామిడి గ్రామానికి చెందిన పెద్దమాల దేవయ్య(47) శంకర్‌పల్లిలో పనులు ముగించుకుని మంగళవారం రాత్రి ఇంటికి వస్తుండ గా కేశవపల్లి గ్రామ సమీపంలో అడవి పంది ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వెళుతున్నవారు గుర్తించి 108 వాహనంలో వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆసుపత్రికి వైద్యులు సిఫారసు చేశారు. గాంధీ ఆసుప్రతిలో చికిత్స పొందుతూ దేవయ్య బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వం మృతుడి కుటుంబానికి రూ. 6 లక్షల ఎక్స్‌గ్రేషియా చెలించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ చిట్టెపు మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు జిల్లా కలెక్టర్లతో సీఎం సమావేశం

హాజరు కానున్న కలెక్టర్ దివ్య దేవరాజన్

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

భూ రికార్డుల ప్రక్షాళనపై క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శనం చేసేందుకు ఈ నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ నిర్వహించే జిల్లా కలెక్టర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ హాజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో రికార్డుల ప్యూరిఫికేషన్, అప్‌డేషన్ ఏ విధంగా చేపట్టాలనే అంశంపైన సీఎం కేసీఆర్ జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, అదే నెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్న రికార్డుల పరిశీలనకు సంబంధించి సీఎం వారికి పలు సూచనలు చేయనున్నారు. భూ రికార్డుల ప్రక్షాళన, నిర్వహణ, పట్టాదారు పాసు పుస్తకాలు, పహణీల్లో మార్పులు, రిజిస్ట్రేషన్‌లో తీసుకు వస్తున్న సంస్కరణల గురించి దిశా నిర్దేశం చేయనున్నారు.

విద్యుత్ ఏఈపై దాడి చేసిన ముగ్గురిపై కేసు

పరిగి : విద్యుత్ ఏఈపై దాడిచేసి, విధులకు ఆటంకం కల్గించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు. పరిగి పట్టణానికి చెందిన హాశంఅలీ ఇంటి అవసరాలకు సంబంధించి విద్యుత్‌ను చౌర్యం చేశారని గతంలో విజిలెన్స్ అధికారులు గుర్తించి నోటీసు ఇచ్చారు. విద్యుత్ బిల్లు చెల్లించాలని బుధవారం పరిగి మండల ఏఈ రాంచంద్రయ్య సిబ్బందితో వెళ్లి హాశంఅలీని అడిగాడు. బిల్లు కట్టడానికి అలీ నిరాకరించడమే గాక అతడి కొడుకులు ఏఈపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు హాశంఅలీ, అతడి కొడుకులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

స్టడీ టూర్‌కు సిద్ధమవుతున్న మార్కెట్ కమిటీ పాలకవర్గం

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ గడువు మరో రెండు నెలల్లో పూర్తి కావస్తోంది. దీంతో పాలకవర్గం స్టడీ టూర్‌కు ప్లాన్ వేసుకున్నారు. ఈసారి పాలకవర్గం సమావేశాన్ని రహస్యంగా నిర్వహించి స్టడీ టూర్ పేరిట ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించారు. స్టడీ టూర్ పేరిట రూ. 1 లక్ష వరకు మార్కెట్ కమిటీ వ్యయం చేసుకోవచ్చనే నిబంధన ఉంది. పాలకవర్గ పదవీ కాలం సమయంలో ఒకసారి ఇతర రాష్ట్రాలకు స్టడీ టూర్ వెళ్లేందుకు రూ.లక్ష వరకు వ్యయం చేసుకోవచ్చని మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.


తాండూరు మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశమైన దృశ్యం(ఫైల్)

అయితే కొందరు డైరెక్టర్లు ఫ్లైట్ ఎక్కేందుకు ఆసక్తి చూపుతుండటంతో గంజ్ అసోసియేషన్(వ్యాపారుల) ప్రతినిధులను రూ. 1 లక్ష ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే, ఇప్పటి వరకు ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని, ఇప్పుడు కూడా ఇచ్చేది లేదని వ్యాపార ప్రతినిధి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో స్టడీ టూర్ చేసి మార్కెట్‌కు, రైతులకు ఏం ప్రయోజం చేస్తారన్నది మార్కెట్‌లో ఆసక్తిగా చర్చకు తెరలేపింది. ఈ విషయమై మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

'మతసామరస్యంతో పండగలు జరుపుకోవాలి'

బంట్వారం : పండుగలను మతసామరస్యంతో జరుపుకోవాలని సర్పంచ్ మొగులయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని తొర్మామిడి గ్రామంలో శివాజి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి హోమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు మతసామరస్యంతో పండుగలను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గోపాల్, నర్సింహులు, దత్తు, దీపక్, రాజు, మొగులయ్య, దేవేందర్, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ప్రత్యేక పూజలు

కులకచర్లలో నెలకొల్పిన పలు వినాయకుల దగ్గర భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పతాంజలి యోగా గురువు రాందేవ్ బాబా ఆయుర్వేదిక్ సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపం దగ్గర పలువురు భక్తులు పాల్గొని పాటలు పాడి భజనలు చేశారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. - **కులకచర్ల**



బెంబేలెత్తిస్తున్న అడవి పందులు

- **పంటనష్టంతో రైతుల ఆందోళన**
- **పగలు, రాత్రి తేడా లేకుండా రోజంతా పంటచేల వద్ద పడిగాపులు**
- **సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన**

పూడూరు: అడవి పందులు పంట పొలాలను పాడు చేస్తున్నాయి. ప్రతి ఏటా అడవి పందుల భారిన పడి పంటనష్టం వాటిల్లడం మండలంలో పరిపాటిగా మారింది. మొక్కజొన్న సాగు చేసిన రైతులకు అడవి పందులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అప్పులు చేసి సాగు చేసిన మొక్కజొన్న పంటను చేను లోనే బంతికడుతూ, గుంపులుగా చేలో కలియతిరుగతూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పూడూరుతో పాటు అటవి ప్రాంతానికి ఆనుకొని ఉన్న గొంగుపల్లి, ఎన్కెపల్లి, మన్నెగూడ, మీర్జాపూర్, కండ్లపల్లి, అంగడిచిట్టంపల్లి, రాకంచర్ల, సోమన్‌గుర్తి, మేడికొండ, మేడిపల్లికలాన్ తదితర గ్రామాలలో అడవి పందులు మొక్కజొన్న పంటలపై పడి దాడి చేస్తున్నాయి. ఖరీఫ్ పంటగా సుమారు 15 వందల హెక్టార్లకు పైగా మొక్కజొన్నలు సాగు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్నలు పంటదశకు చేరుకుని మొక్కజొన్న బుట్టలు గింజలు పోసుకుంటున్నాయి. ఇదే అదనుగా భావించిన అడవి పందులు మొక్కజొన్న పంటచేలో పడి ఇష్టంవచ్చినట్లు తినడమే కాకుండా చేనంతా తొక్కి పాడుచేస్తున్నాయి. మొక్కజొన్న దంట్లను పీకి కుప్పలుగా పెట్టి అందులోనే నివాసముంటున్నాయి. ఇటీవల మండల పరిధిలోని మేడిపల్లికలాన్‌లో నర్సింహారెడ్డికి చెందిన 2 ఎకరాల మొక్కజొన్న పంటను అడవి పందులు నేల మట్టం చేశాయి. అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు టపాసులు పేల్చడం, చేల చుట్టు చీరలు, ముళ్లకంచెలు, బెదుర్లవంటివి ఏర్పాటు చేసిన అవి ఏమాత్రం భయపడటం లేవని రైతులు వాపోతున్నారు. పగలు, రాత్రి అని తేడా లేకుండా రోజంతా పంటచేల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవిపందుల బారిన పడి పంటలకు నష్టం వాటిల్లుతున్న సంబంధిత శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై రాతి కంచెలు ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



పందుల దాడితో నష్టపోయిన మొక్కజొన్న పంటను చూస్తూ దిగాలుగా కూర్చున్న రైతు

పంటలకు రక్షణ కల్పించాలి



అడవి పందుల నుంచి రైతుల పంటలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. పంటనష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలి. అప్పులు చేసి సాగు చేసిన పంటలు అడవిపందులు పాడు చేస్తే పెట్టుబడి కూడా రావడం లేదు.

- శంకర్, రైతు చిన్నబండ తండా

క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

పరిగి మున్సిఫ్ కోర్టు జడ్జి భారతి

దోమ: క్షణికావేశానికి గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని పరిగి మున్సిప్‌కోర్టు జడ్జీ భారతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గూడూరు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన పొంది ఉండాలన్నారు. చిన్న చిన్న విషయాలను సాధ్యమైనంత వరకు గ్రామీణ స్థాయిలోనే పరిష్కరించుకోవడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ యాదవరెడ్డి, పరిగి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్, ఏజీపీ సీహెచ్ బాలముకుందం, న్యాయవాదులు లింగం, అనంతరెడ్డి, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ విజయవంతం చేయాలి

మండల ప్రత్యేకాధికారి వరప్రసాద్

కులకచర్ల: బతుకమ్మ చీరల పంపకాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలోని డీలర్లు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, సెర్ఫ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 18 సంవత్సరాలు పై బడిన ప్రతి మహిళకు తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేస్తున్న బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలన్నారు. ఇందుకోసం గ్రామాల వారిగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. రేషన్ షాపుల వారిగా అర్హత గల మహిళలను గుర్తించి వారికి పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాస్‌శంకర్, గిర్దావర్ అనంతసేన్‌రావు, సూపరిండెంట్ లింగయ్య, ఏపీఎం శోభ పాల్గొన్నారు.

అందుబాటులో టేకు వేర్లు

పరిగి: హరితహారం కింద టేకు మొక్కలు నాటేందుకు టేకువేర్లు అందుబాటులో ఉన్నాయని పరిగి వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకుడు పిఎస్ నాగేశ్‌కుమార్ తెలిపారు. పరిగి సబ్ డివిజన్‌లోని పరిది, దోమ, కులకచర్ల, పూడూరు మండలాలకు 1.20లక్షల టేకు వెర్లను తీసుకరావడం జరిగిందని తెలిపారు. ప్రతి మండలానికి 30 వేల చోప్పున కేటాయిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులు ఏవోలను కలిసి తీసుకోవాలని సూచించారు.

కులకచర్ల: మండల వ్యవసాయ కార్యాలయంలో 30 వేల టేకు వేర్లు ఆందుబాటులో ఉన్నాయని, కావల్సిన రైతులు ఉచితంగా పొందవచ్చని వ్యవసాయాధికారి పాండు తెలిపారు. అస్సాం నుంచి నాణ్యమైన టేకు వేర్లు తెప్పించామన్నారు.

రుణాల రికవరీలపై
వీఏవోలు చొరవ చూపాలి

దోమ: మహిళ సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ఎక్కువ మొత్తంలో ఇప్పించే విధంగా వీఏవోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏపీఎం బందయ్య అన్నారు. బుధవారం సెర్ఫ్ కార్యాలయంలో వీఏవోలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, మహిళ సంఘాల సభ్యులు బ్యాంక్‌ల ద్వారా అప్పులు తీసుకొని పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలు చెల్లించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీఏవోలు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలు సకాలంలో చెల్లించాలి

పూడూరు: స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలని కంకల్ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండల పరిధిలోని కంకల్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో బ్యాంక్ సిబ్బంది, సెర్ఫ్ సిబ్బంది కలిసి మహిళ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సంఘాలు సమన్వయంతో రికవరీ చేయు పద్దతిపై చర్చించారు. ఈ ఏడాదిలో 74 లక్షల స్త్రీనిధి రుణాలు అందజేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. అన్ని సంఘాల సభ్యులు ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాల నమోదు, సంఘాల రికార్డులు సక్రమంగా చూడటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, సెర్ఫ్ సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చీకటి దినంగా భావించాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణారెడ్డి

పూడూరు: ప్రతి ఉద్యోగి సామూహిక సెలవును పాటించి సెప్టెంబర్-1న చీకటి దినంగా భావించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండల పరిధిలోని రాకంచర్ల టీటీడీ కల్యాణ మంటపంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పి ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష,కార్యదర్శులు అమర్‌నాథ్, రాఘవేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ అసోషియేట్ అధ్యక్షుడు ఇ.అంజిలయ్య, మహిళ ఉపాధ్యక్షురాలు పి.ప్రభావతి, బాల్‌రాజ్, హేమతల, నర్సింహులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణారెడ్డి

పీఆర్‌టీయూ టీఎస్ మద్దతు...

కులకచర్ల: సీపీఎస్ విధానం రద్దుకై ప్రభుత్వ ఉద్యోగుల సెప్టెంబరు 1 సామూహిక సెలవుకు పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర సంఘం మద్దతు తెలియజేసిందని ఆ సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు హన్మంతు, రాకేష్‌లు తెలిపారు. సామూహిక మద్దతు ప్రకటిస్తూ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారన్నారు.

దీక్షలకు తరలిరావాలి

పరిగి: సీపీఎస్ రద్దు కొరకై సెప్టెంబర్ ఒకటిన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సామూహిక దీక్షకు భారీగా తరలిరావాలని వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, టిఎస్‌యూటిఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు బి.జైపాల్, పాండురంగాచారి, టిఎస్‌సిపిఎస్‌ఈఏ మండల అధ్యక్ష,కార్యదర్శులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, బి.నరసింహ్మారాజ కోరారు. బుధవారం వేర్వేరు చోట్ల వాల్‌పోస్టర్లు విడుదల చేశారు.

•చినుకు పడితే చిత్తడే...

చినుకు పడితే చాలు కులకచర్ల చౌరస్తా చిత్తడిగా మారుతుంది. మంగళవారం రాత్రి కురిసిన ముసురు వర్షానికి చౌరాస్తాలోని బండవెల్కిచర్ల దారి బురదమయంగా మారింది. **- కులకచర్ల**



ఈజీఎస్ఎఫ్ఏ కార్యవర్గం ఎన్నిక

పరిగి: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం బుధవారం ఏకగ్రీంగా ఎన్నికైంది. మండల ఎఫ్ఏల అధ్యక్షుడిగా రాఘవేందర్‌రావు(గడిసింగాపూర్), కార్యదర్శిగా కె.స్వామి(సుల్తాన్‌పూర్); ఉపాధ్యక్షులు ఎం.నర్సింహులు(రాపోల్), సంయుక్తకార్యదర్శి రాజు(పరిగి), కోశాధికారి రాందాసు(బసిరెడ్డిపల్లి), సహాయ కోశాధికారి వి.మహేందర్(కాళ్ళాపూర్), సలహాదారులుగా అంజయ్య, శేఖర్, శంకర్, సయ్యద్‌మల్కాపూర్), మల్లయ్య, ఎల్లప్ప ఎన్నికయారని జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు.

పాంబండ చైర్మన్‌గా బాల్‌రెడ్డి

కులకచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర దేవాలయ చైర్మన్‌గా బండవెల్కిచర్ల బాల్‌రెడ్డి నియమితులయ్యారు. బుధవారం దేవాలయం ఆవరణలో ఈవో స్నేహలత పాలకవర్గ కమిటీ, సభ్యులను చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్లు రాములు, సర్వారెడ్డి, డి.రాములు, లక్ష్మమ్మ, సూర్యప్రకాష్, పూజారి దశరతంలచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధి పట్ల తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఉమాపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎబీబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్, సర్పంచ్ రామలింగం, ఎంపీటీసీ పాల్గొన్నారు.

'ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి'

కులకచర్ల: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని సర్వశిక్షా అభియాన్ జిల్లా పరిశీలనాధికారి దోమ ఎంఈవో హరిశ్చందర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ముజాహిత్‌పూర్, కులకచర్ల క్లస్టర్ల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. పిల్లలను చదివించి రాయించారు. అనంతరం కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన హెచ్ఎంల సమావేశంలో మాట్లాడారు. త్రీఆర్స్ 60 రోజుల కార్యక్రమంలో భాగంగా గడిచిన 10 రోజుల కార్యక్రమంపై ఆయన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పరిశీలకులు చెర్క సత్తెయ్య, లాల్య, ఎంఈవో అబీబ్‌హైమద్, హెచ్ఎంలు వెంకటయ్య, సురేందర్‌రెడ్డి, రాములు, పరందాములు పాల్గొన్నారు.

'సాక్షరభారతి కో-ఆర్డినేటర్లకు
ఉద్యోగ భద్రత కల్పించాలి'

పరిగి: సాక్షరభారతి కో-ఆర్డినేటర్‌ల సమస్యల సాధనకోసం చేపట్టిన సమ్మె బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. మండల పరిషత్ అవరణలో గ్రామ కో-ఆర్డినేటర్లు సమ్మెలో కూర్చోన్నారు. ఈ సందర్భంగా సాక్షరభారతి కో-ఆర్డినేటర్‌ల సంఘం మండల అధ్యక్షుడు బుర్ర అంజిలయ్య మాట్లాడుతూ, గ్రామ కో-ఆర్డినేటర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అక్షరాస్యత కార్యక్రమాలను ప్రతిష్టంగా కొనసాగించాలన్నారు. సంగీత, సంధ్యారాణి, చంద్రయ్య, బి.అనూష, సావిత్రి,మంజుల, సుజాత పాల్గొన్నారు.



టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని నియోజకవర్గ చైర్మెన్ కిష్టప్ప అన్నారు. బుధవారం మండలంలోని బిచ్చాల్‌లో జేఏసీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ చైర్మెన్‌గా వెంకటప్ప, చైర్మెన్‌గా చాకలి వెంకటప్ప, నర్సిములు, చెన్నప్ప, శేఖర్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌరారంగోపాల్, ప్రవీణ్‌కుమార్, పులేంధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. - **దౌల్తాబాద్**

సమయాన్ని స్పిన్ చేద్దాం..

- స్పిన్నర్లకు మార్కెట్లో భలే గిరాకీ
- మానసిక ఒత్తిడి తగ్గుదలకు దోహదం
- చేతివేళ్లకు మంచి వ్యాయామం

కొడంగల్‌రూరల్: సమయం ఎవరికైనా విలువైనదే. కొన్ని సందర్భాల్లో దాన్ని ఎలా గడపాలి... ఖాళీ సమయాల్లో ఏం చేయాలి...అని ఆలోచించినప్పుడు ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పిల్లల దగ్గర నుంచి యువతరం, మహిళలు ఇలా చాలామంది స్పిన్నర్స్‌తో గడుపుతూ ఆ లోటును భర్తీ చేసుకుంటున్నారు. ఒకవైపు సరదాగానూ ఉండే ఈ పరికరం ఖరీదు కూడా తక్కువే కావడంతో ఇప్పుడు అందరికీ ఇదో ట్రెండ్. రూ.30 నుంచి మొదలుకొని రూ.1,000 వరకు ఇవి అందుబాటులో ఉన్నాయి. ఇంతకు స్పిన్నర్స్ అంటే బొటన వేలి మధ్య వేలు మధ్యన పెట్టుకుని గిర్రున తిప్పితే చాలా సమయం వరకూ అది ఆగకుండా తిరుగుతుంది. చిన్న బేరింగ్ సహయంతో ఇది తిరుగుతుంది. ఆడే వారికే కాదు... చూసే వారికీ సరదాగా అనిపించడం దీని ప్రత్యేకత. ప్రయాణ సమయాల్లో, తీరిక వేళల్లో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అందు బాటులో అనేక రకాలు

స్పిన్నర్స్‌లో వివిధ రకాలు ఉన్నాయి. మూడు చక్రాలు, నాలుగు చక్రాల స్పిన్నర్స్ మార్కెట్‌లో లభిస్తున్నాయి. ప్లాస్టిక్ నుంచి ఇత్తడి, స్టీలు బ్రాండ్ ఇలా అనేక రకాల మెటీరియల్స్‌లో లభిస్తున్నాయి. రాత్రి వేళల్లో లైట్లు వెలిగేవి కూడ లభిస్తున్నాయి. పిల్లల కోసం స్పైడర్ మ్యాన్, బొమ్మల రూపంలోనూ అందుబాటులోకి తీసుకువచ్చారు. రకరకాల ఆకారాల్లో లభించడంతో అందరు కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.



స్పిన్నర్స్‌తో ఉపయోగాలు...

స్పిన్నర్స్‌తో కొంత సేపు ఆడుకుంటే మానసిక ఒత్తిడి తగ్గిపోతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. సిగరేట్ తాగేవారు కూడ చేతి వేళల్లో సిగరేట్‌కు బదులు స్పిన్నర్స్ పెట్టుకొని తిప్పుతుంటే కొంత సమయాన్ని తేలిగ్గా దాటేయొచ్చు. దీంతో కొంత ఏకాగ్రత, చేతి వేళ్లకు కొంత వ్యాయమం లభిస్తుంది. అదే పనిగా సెల్‌ఫోన్ వాడేవారు దీన్ని ఉపయోగిస్తే బాగుంటుందని, ఫోన్ వాడకం కొంత వరకు తగ్గించవచ్చునని చెబుతున్నారు. ఎక్కువగా స్పిన్ చేయడంతో ప్రమాదవశాత్తు ముఖానికి తగిలి గాయాలైన సంఘటనలు కూడ ఉన్నాయి.

'సాక్షరభారత్ కోఆర్డినేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కో ఆర్డినేటర్లు

కొడంగల్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు కొనసాగుతున్న సాక్షరభారత్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న కో ఆర్డినేటర్‌లకు ఉద్యోగ భద్రతను కల్పించాలని మండల కో ఆర్డినేటర్ కృష్ణంరాజు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ముఖానికి నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన తెలిపారు. గ్రామీణ కో ఆర్డినేటర్‌లకు రూ.10వేలు కనీస వేతనం అందిస్తూ మండల కో ఆర్డినేటర్‌లకు రూ.30వేల వేతనాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. నిరసనలో కో ఆర్డినేటర్‌లు చిన్నయ్య, పకీరప్ప, వెంకటయ్య, కవిత, ఫరీదాబేగం తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో...

దౌల్తాబాద్: సాక్షరభారత్ ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండో రోజు సమ్మె కొనసాగించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ సూర్యనారాయణరావుకు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్బంగా మండల కో ఆర్డినేటర్ వెంకటేశ్ మాట్లాడుతూ గ్రామ కో ఆర్డినేటర్‌లకు రూ.10వేలు, మండల కో ఆర్డినేటర్‌లకు కనీస వేతనం అందించాలని కోరారు. హెల్త్‌కార్డులు, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. సమ్మెలో కో ఆర్డినేటర్‌లు శివశంకర్, యాదగిరిరెడ్డి, పకీరప్ప, అనంతప్ప, రవీందర్‌రెడ్డి, శివకుమార్, స్వాతి, సంగీత, అనంతలక్ష్మీ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు. సాక్షరభారత్ సమ్మెకు ఎంపీపీ నర్సింగ్‌బాన్‌సింగ్, సర్పంచ్ కాశప్ప మద్దతు తెలిపారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

కొడంగల్‌రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా ఆర్గనైజర్ సెక్రటరి టి.అనిల్ తెలిపారు. నగర కార్యదర్శిగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా మహేశ్వరి, అరవింద్, నరేశ్, అశోక్, సంయుక్త కార్యదర్శులుగా అనిల్, మోహన్, ఐలమ్మ, చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా శిరీష, అమరేశ్, నందిని, రమేశ్, మహేశ్, ప్రియాంక, మహిళా కన్వీనర్‌లుగా శిరీష, ప్రియాంకలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

'గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి'

కొడంగల్‌రూరల్: గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేయాలని ఎంపీపీ దయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ మిషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు మంజూరైన 35 చెత్త సేకరణ రిక్షాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సేకరణ కోసం రిక్షాలను అందించడంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా అందించిన రిక్షాలు... చిన్ననందిగామకు 1, అంగడిరైచూర్‌కు 1, అన్నారంకు 1, అప్పాయిపల్లికి 1, చిట్లపల్లికి 2, హస్నాబాద్‌కు 3, ఇందనూర్‌కు 1, కస్తూర్‌పల్లికి 1, కొడంగల్‌కు 6, కొండారెడ్డిపల్లికి 1, లక్ష్మీపల్లికి 1, నాగారంకు 1, పర్సాపూర్‌కు 2, పాతకొడంగల్‌కు 1, పెద్దనందిగామకు 2, ప్యాలమద్దికి 1, రావుల్‌పల్లికి 2, రుద్రారంకు 3, టేకుల్‌కోడ్‌కు 2, ఉడిమేశ్వరంకు 1 చొప్పున అందించారు. ఈ సందర్బంగా సర్పంచ్‌లు మల్లీశ్వరి, మొగులప్ప, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఎన్.రాజేందర్, ఎంపీడీఓ వీరబ్రహ్మాచారి, ఈఓపీఆర్డీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, భాగ్యలక్ష్మీ, బాలరంగచారి తదితరులు ఉన్నారు.



చెత్త సేకరణ రిక్షాలను అందిస్తున్న ఎంపీపీ

'సీపీఎస్ రద్దు కోసం సామూహిక సెలవు'



ఎంఈవోకు సామూహిక సెలవు పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట్: సీపీఎస్ విధానం రద్దు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పత్రాన్ని ఉపాధ్యాయులు అందించారు. బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ రాంరెడ్డికి ఉపాధ్యాయులు సెలవు పత్రాలను అందించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేంత వరకు నిరసన తెలియజేస్తామన్నారు.



హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వ్యవసాయ శాఖ తరపున రైతులకు టేకు మొదళ్లను అందించారు. బుధవారం మండల ఎంపీపీ మంగమ్మ చేతుల మీదుగా ఆసక్తి గల రైతులకు టేకు మొదళ్లను అందించారు. మండలానికి ప్రస్తుతం 30 వేల టేకు మొదళ్ల వచ్చినట్లు ఆమె తెలిపారు. రైతులు పొలాల గట్లపై నాటి మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు రమేశ్‌నాయక్, మోహియోద్దీన్, భార్గవి, రేణుక తదితరులు పాల్గొన్నారు. **(దౌల్తాబాద్)**

అడవిపందుల దాడిలో నష్టపోయిన పంట పరిశీలన



దుద్యాలలో పంటను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

బొంరాస్‌పేట్: అడవి పందుల దాడికి పంటలను కాపాడుకోలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మెట్లకుంట గ్రామంలో 6 ఎకరాల మొక్కజొన్న పంటను ద్వంసం చేసిన పందులు మంగళవారం రాత్రి దుద్యాలలో కంది పంటను ద్వంసం చేశాయి. అడవి పందుల బారి నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో బుధవారం రెవెన్యూ అధికారులు పంటలను పరిశీలించారు. మండల రెవెన్యూ అధికారి అనిత నేతృత్వంలో అధికారులు దుద్యాలలో పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టపరిహారాన్ని అంచన వేశారు. ఈ సందర్బంగా గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

రేగడిమైలారంలో విద్యార్థులకు రూబెల్లా టీకాలు

బొంరాస్‌పేట్: చిన్నారుల్లో వచ్చే తట్టు, మీజిల్స్‌ను నివారించేందుకు చేపట్టిన టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం మండల పరిధిలోని రేగడిమైలారం ప్రాథమికోన్నత పాఠశాలలో వైద్యులు రవీంద్ర యాదవ్, కొండల్ విద్యార్థులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, మల్లికార్జున్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

మర్పల్లి : సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉపాధ్యాయురాలు ప్రభావతి అన్నారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న కేజీబీవీ, పీటీఐ, సీఆర్‌పీఎస్, ఐఈఆర్‌పీఎస్ ఉద్యోగస్తులుగా ప్రభుత్వ పాఠశాలలో చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వేతనాలు కూడా పెంచడం లేదని వాపోయారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు


స్వామి వారికి 81 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న వివేకవాణి విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొజ్జ గణపయ్యకు 81 రకాల నైవేద్యం

వికారాబాద్ అర్బన్ : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో శ్రీ వివేకవాణి విద్యాలయంలో బుధవారం ఉదయం బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నాగయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి 81 రకాల ప్రసాదాల నైవేద్యాలను స్వామి వారికి సమర్పించారు. పాఠశాలలోని విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారుచేసి స్వామి వారి పూజలో పెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగయ్య, కాలనీవాసులు ప్రసాద్, శ్రీనివాస్, కన్నయ్య, శ్రీకాంత్, లక్ష్మణ్, సంతోష్, సందీప్, ఉపాధ్యాయులు చంద్రకళ, ఇస్మాయిల్, రామ కృష్ణ, విద్యార్థులు కాలనీవాసులు పాల్గొన్నారు.

వినాయక లడ్డు రూ.65 వేలకు వేలం

ధారూరు : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన వినాయక లడ్డు వేలంలో ధారూరుకు చెందిన మంగళి శ్రీనివాస్ అనే వ్యక్తి లడ్డును రూ.65వేలకు పాట పాడి దక్కించుకున్నాడు. ధారూరు హిందూ యువసేన ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక లడ్డును వేలం పాటలో శ్రీనివాస్ తీసుకున్నారు. గ్రామ హిందూ ఉత్సవ కమిటీ, పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుని లడ్డును విశ్వనాథం రూ.42వేలకు పాడి తీసుకున్నారు. ఈ వేలం పాటలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు అవుసుపల్లి అంజయ్య, కమ్మరి శ్రీనివాస్, నెల్లి విశ్వనాథంలు పాల్గొని వేలం పాటదారులకు లడ్డులను అందజేశారు.

'రుణాలు పొందిన లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటుచేయాలి'

మర్పల్లి : కార్పొరేషన్ రుణాలు పొంది యూనిట్లు ఏర్పాటు చేయని లబ్ధిదారులకు అధికారులు నోటీసులు జారీచేస్తున్నారు. మండల పరిధిలోని దామస్తాపూర్ గ్రామంలో బుధవారం మండల స్థాయి అధికారులు, బ్యాంకు సిబ్బంది గ్రామాలకు వెళ్లి రుణాలు పొందిన లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు. మండలంలో మొత్తం ఎస్సీ కార్పొరేషన్ కింద 127, బీసీ కార్పొరేషన్ కింద 37మంది రుణాలు పొందారు. దామస్తాపూర్ గ్రామంలో 15మంది బీసీ కార్పొరేషన్, 17మంది ఎస్సీ కార్పొరేషన్ కింద రుణాలు పొందగా వీరికి టెంట్‌హౌస్, గొర్రెల యూనిట్లకు, బోరు మోటార్లకు, ఆటోలకు తదితర వాటికి రూ.60వేల నుంచి లక్ష రూపాయలు మంజూరు చేశారు. ఇద్దరు ఎస్సీ, ఇద్దరు బీసీ లబ్ధిదారులు రుణాలు పొంది యూనిట్లు ఏర్పాటు చేయలేదని ఈవోఆర్డీ అశోక్‌కుమార్ అన్నారు. వారికి వెంటనే నోటీసులు జారీ చేస్తున్నామని వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

'బతుకమ్మ చీరలు రేషన్‌షాపుల్లో భద్రపరచాలి'

ధారూరు : బతుకమ్మ చీరలను డీలర్లు రేషన్ దుకాణాల్లో భద్రపరవాలని తహసీల్దార్ గాయత్రి ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ చీరల పంపిణీపై వీఆర్వోలకు, రేషన్ డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సెప్టెంబర్ 10నుంచి రేషన్ దుకాణాలకు ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరలు పంపిణీ అవుతాయని, వీటిని డీలర్లు దుకాణాల్లో సురక్షితంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. మండలంలో 12,935 బతుకమ్మ చీరలు రానున్నాయని, వీటిని వర్షానికి తడవకుండా ఎలుకలు, పందికొక్కులు పాడుచేయకుండా డీలర్లు భద్రపరచాలని అన్నారు. సెప్టెంబర్ 18న ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు చీరల పంపిణీ చేస్తారని ఆమె చెప్పారు.

మూణ్ణాళ్ల ముచ్చటే..

- ఊడిపోతున్న స్పీడు బ్రేకర్లు
- పట్టించుకోని అధికారులు

వికారాబాద్ అర్బన్ : ప్రమాదాలను నివారించాలని సదుద్దేశ్యంతో ఏర్పాటుచేసిన స్పీడు బ్రేకర్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఈనెల ఎన్నెపల్లి సమీపంలో స్కూల్ బస్సు ప్రమాదం జరగడంతో అప్రమత్తమైన జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా కలెక్టర్ సహకారంతో పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద, స్కూల్ పరిసర ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేస్తోంది. ముందుగా ఎన్నెపల్లి చౌరస్తా, ఎస్పీ కార్యాలయం ఎదుట అధికారులు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు.


ఎస్పీ కార్యాలయం ఎదుట ఊడిపోయిన స్పీడ్ బ్రేకర్లు

ప్రస్తుతం పట్టణంలోని ప్రధాన చౌరస్తా ఎన్టీఆర్, బీజేఆర్, ఎంఆర్‌పీ చౌరస్తాలో వేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆ స్పీడు బ్రేకర్ల పైనుంచి పెద్ద పెద్ద వాహనాలు వెళ్లడంతో అవి పనిచేయడం లేదు. ప్లాస్టిక్ స్పీడు బ్రేకర్లకు నట్లు కొట్టి రోడ్డు లోపలికి దించారు. కాని అవి అధిక లోడుతో వచ్చే వాహనాలను తట్టుకోలేక ఊడిపోతున్నాయి. దీంతో స్పీడు బ్రేకర్లు వేసిన అవి నిరుపయోగంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి నాణ్యత కలిగిన స్పీడు బ్రేకర్లను వేయాలని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు.

పేదింటి బిడ్డ డాక్టర్, ఇంజనీర్ కావాలి

మాజీ మంత్రి, భృంగీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

వికారాబాద్ అర్బన్ : గ్రామీణ ప్రాంతంలోని పేదింటి బిడ్డ డాక్టర్, ఇంజనీర్ కావాలనే ఆశయంతోనే భృంగీ విద్యాసంస్థలు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, భృంగి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం భృంగీ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని స్థానిక బసంత్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఎమ్మెల్యే, మంత్రిగా చేసిన నాకు ఈ ప్రాంత పరిస్థితులు తెలుసన్నారు. ఇక్కడ అప్పట్లో చదువుకోవడానికి కేవలం ఎస్ఏపీ కళాశాల మాత్రమే ఉండేదన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ రోజు విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు మీపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదవాలన్నారు. అంతకుముందు కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు చంద్రశేఖర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎస్ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్, డైరక్టర్లు సురేష్, శివప్రసాద్, ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఆల్బర్ట్, నవీన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిగ్నల్స్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

వికారాబాద్ అర్బన్ : వికారాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటుచేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను బుధవారం కలెక్టర్ దివ్యదేవరాజన్, జిల్లా ఎస్పీ అన్నపూర్ణ పరిశీలించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు ఎంఆర్‌పీ చౌరస్తాలో ఏర్పాటుచేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు ఏ విధంగా పనిచేస్తాయని సిగ్నల్స్ ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి సిగ్నల్స్ వద్ద కొన్ని నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో ఉన్న కొన్ని జెండా కట్టలు, అదే విధంగా ఏమైన పెద్ద స్తంభాలు ఉంటే వాటిని తీసివేయాలని ఆదేశించారు. వీరి వెంట టీపీవో మాధవి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ చిన్న అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


వికారాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ దివ్య, ఎస్పీ అన్నపూర్ణ

'ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి'


విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాణి

మోమిన్‌పేట : ప్రభుత్వ సదుపాయాలను పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అమ్రాదికుర్దు గ్రామ సర్పంచ్ రాణి సూచించారు. బుధవారం మండలంలోని అమ్రాదికుర్దు పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధన అభ్యసించడానికి అవసరమైన కనీస సౌకర్యాలను ప్రభుత్వం దశలవారీగా కల్పిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించడానికి అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, నాయకులు అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

క్లస్టర్ వ్యవస్థను తొలగించాలి

-నర్సిములు, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉపాధ్యక్షుడు

ఇంటర్వ్యూ



మోమిన్‌పేట : గ్రామ పంచాయతీ కార్యదర్శులకు క్లస్టర్ వ్యవస్థతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉపాధ్యక్షుడు నర్సిములు వెల్లడించారు. ఒక గ్రామ కార్యదర్శికి 3నుంచి 4 గ్రామాలు కేటాయించడం వల్ల సకాలంలో ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంటిపన్నులు వసూలుచేస్తూ పంచాయతీ సిబ్బంది నిర్వహణను నెట్టుకొస్తున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్ర : గ్రామాల్లో కార్యదర్శులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు ?

జ : ఒక్క కార్యదర్శికి 3నుంచి 4 గ్రామాలు కేటాయించడం, సకాలంలో ప్రజల సమస్యలను తీర్చడంలో ఇబ్బందులు, ఇంటిపన్నుల లక్ష్యాల సాధనలో ఇబ్బందులు, ముఖ్యంగా గ్రామ కార్యదర్శులకు క్లస్టర్ వ్యవస్థ ఉండడం వంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ప్ర : పంచాయతీ కార్యదర్శులపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారుల ద్వారా ఏమైన వత్తిడిలు ఉన్నాయా ?

జ : గ్రామాల్లో వివిధ రకాల ప్రభుత్వ పనులు అమలుచేయడంలో ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారు. వత్తిడిలు ఏమీ లేవు.

ప్ర : గ్రామ పంచాయతీలకు నిధులు ఎలా సమకూర్చుకుంటున్నారు ?

జ : ఇంటి పన్నుల వసూళ్లతో గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలను చెల్లించాల్సి వస్తుంది. ప్రజల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులు చేయడానికి నిధుల కొరత ఉంది. ఇంటిపన్నుల వసూళ్లపై దృష్టి సారించి చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నా. ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం, ప్రభుత్వ అధికారుల సహకారంతో ముందుకు వెళుతున్నాం.



హాజరైన అధికారులు

మిషన్ భగీరథ పనుల్లో వేగం పెంచాలి

సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

వికారాబాద్ అర్బన్ : జిల్లాలో చేపడుతున్న మిషన్ భగీరథ పనుల్లో మరింత వేగం పెంచి ఇంటింటికి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో చేపడుతున్న మిషన్ భగీరథ పనులపై కలెక్టర్ దివ్య, ఎమ్మెల్యే సంజీవరావు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే సంవత్సరం జనవరి నాటికి ఇంటింటికి తాగునీటిని అందించేందుకు వీలుగా జిల్లాలో రూ. 2 వేల కోట్లతో మిషన్ భగీరథ పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే వికారాబాద్, తాండూరు, పరిగిలలో పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయనీ, కొడంగల్ పరిధిలో కొంత నెమ్మదిగా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలో మిషన్ భగీరథ పనులు ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయనీ, గడువులోగా ఇంటింటికి తాగునీటిని అందించడం జరుగుతుందని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథపైన సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారనీ, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మిషన్ భగీరథ పనులు పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. కలెక్టర్ దివ్య మాట్లాడుతూ, మిషన్ భగీరథ పనులు చేపడుతున్న క్రమంలో ఆర్ అండ్ బీ రోడ్లు, విద్యుత్, టెలికమ్యూనికేషన్ పనులకు ఆటంకం కలిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ రోడ్లు, విద్యుత్, టెలి కమ్యూనికేషన్ పనులకు సంబంధించిన మరమ్మతు పనులను సంబంధిత కాంట్రాక్టర్లతోనే చేయించాలని ఆమె సూచించారు. సమీక్షలో వికారాబాద్ ఎమ్మెల్యే బి.సంజీవరావు, డీఆర్వో సంధ్యారాణి, మిషన్ భగీరథ ఈఈ ఆంజనేయులు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు హరీశ్వర్‌రెడ్డి

కులకచర్ల : క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద తీసుకుంటుందని టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి అన్నారు. పరిగి జోనల్ స్థాయి అండర్-14, అండర్-17 క్రీడా పోటీలు సోమవారం చౌడాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. క్రీడలను పాఠశాల 2003-04 పూర్వ విద్యార్థులు నిర్వహించారు. క్రీడల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో క్రీడలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. క్రీడల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాద్‌రావు మాట్లాడుతూ, జాతీయస్థాయికి ఎదిగి ఈ ప్రాంతానికి గుర్తింపు తేవాలన్నారు. క్రీడల్లో రాణించే పేద విద్యార్థులకు సహకారం అందిస్తామని తెలిపారు. బుధవారం అండర్-17 కబడ్డీ పోటీల్లో 34 టీంలు పాల్గొన్నాయి. గురువారం అండర్-14 బాలబాలికలకు కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో టీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకులు కొప్పుల అనీల్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఉమాపతిరెడ్డి, టీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజప్ప, నాగరాజు, అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్, సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, హెచ్ఎం సుదర్శన్‌రెడ్డి, పీడీలు ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, ఖాజా, గాంగ్యా, సుదర్శన్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, ఆయా పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



చౌడాపూర్‌లో కబడ్డీ క్రీడాకారులతో కొప్పుల హరీశ్వర్‌రెడ్డి

ఆడపడుచులకు బతుకమ్మ కట్నం

- 18 నుంచి చీరల పంపిణీ
- 598 రేషన్ దుకాణల ద్వారా ఏర్పాట్లు
- జిల్లాకు 2,99,553 మందికి అందజేత
- గ్రామ స్థాయిలో ముగ్గురు సభ్యుల పర్యవేక్షణ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించే పండగ. ఊరు వాడ, పల్లె, పట్నం అనే తేడా లేకుండా మగువలందరూ పూలను పూజించే మహోత్తర పండగ. ప్రకృతిని ఆరాధించే అద్భుత ఘట్టం. అంబరాన్నంటే ఆ సంబరాలు ఈసారి మహిళలకు మరింత ఆనందాన్ని పంచనున్నాయి. కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం బతుకమ్మ పండగకు మహిళలకు చీర కానుకగా ఇవ్వనుంది. ఇప్పటికే రంజాన్, క్రిస్మస్ పండగలకు ప్రభుత్వం దుస్తుల పంపిణీ, విందులను ఏర్పాటు చేసింది. అదే విధంగా ఈ ఏడాది నుంచి పూల పండగను జరుపుకునే మహిళలను గౌరవించేందుకు చీర, జాకెట్‌ను అందించే కొత్త పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 2,99,553 మంది మహిళలకు చీరలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. వాటిని జిల్లాలోని 598 రేషన్ దుకాణాల ద్వారా 18 సంవత్సరాలు నిండిన మహిళలకు అందించనున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లాకు చేరనున్న చీరలను మండల కేంద్రాల్లోని ప్రత్యేక గోడౌన్‌లలో నిల్వ చేసి వచ్చేనెల 18 నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కొడంగల్ : జిల్లాలోని 598 రేషన్ దుకాణాల ద్వారా దాదాపు 2,99,553 మందికిపైగా మహిళలకు చేనేత చీరలను అందించేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే చీరలను భద్రపర్చేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండల కేంద్రాల్లో సైతం చీరలను భద్రపర్చేందుకు ప్రత్యేక గోడౌన్‌లను గుర్తించే పనిలో ఆ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి, అక్కడి నుంచి గ్రామాలకు చీరలను పంపిణీ చేయనున్నారు. రేషన్ దుకాణాల నుంచి సెప్టెంబర్ 18, 19, 20 తేదీల్లో చీరలను మహిళలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో స్వయం సహాయక సంఘాల వీఓ సభ్యులకు, రేషన్ డీలర్లకు అవగాహన కల్పిస్తున్నారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక, మండల ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు సైతం చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాల మహిళా సభ్యులకు ప్రభుత్వం వాయనాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా రూ. 120 కోట్లను కేటాయించి 60 లక్షల మందికి బహుమతులను అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకు జిల్లాలోని డ్వాక్రా సంఘాల మహిళా సభ్యుల వివరాల నివేదికలను సిద్దం చేసుకుని చీరలు, జాకెట్లు అందించేందుకు అధికారికంగా అడుగులు వేస్తోంది. మహిళలు అత్యంత ఇష్టంగా జరుపుకునే పండగల్లో బతుకమ్మ పండగ ప్రధానమైంది. సంప్రదాయాలు ప్రతిబింబించే బతుకమ్మ పండగను మహిళలు, పిల్లలు సంబరంగా జరుపుకుంటారు. పూలను పూజించే పండగ బతుకమ్మ, బతుకమ్మ అంటేనే మహిళల పండగ. పూల పండగను పురస్కరించుకుని ప్రభుత్వం మహిళలందరికీ చీరలను కానుకగా అందించాలని నిర్ణయించింది. పేద మహిళలు ఆర్థికంగా ఇబ్బందులతో పండగకు దూరంగా ఉండరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం చీరలను కానుకగా ఇవ్వాలని నిర్ణయించింది.



చీరల పంపిణీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేషన్ కార్డుల ఆధారంగా...

హిందువుల అతి పెద్ద పండగల్లో బతుకమ్మ పండగ ఒకటి. ఈ పూల పండగకు ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ చీర అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలతో పాటు 18 సంవత్సరాలు నిండిన యువతులకు చీరలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గతంలో ఉన్న రేషన్ కార్డులను రద్దు చేసి వాటి స్థానంలో నూతనంగా ఆహార భద్రత కార్డులను ఏర్పాటు చేసింది. జిల్లాలో 598 రేషన్ దుకాణాలు ఉండగా అందులో లక్ష 35 వేలు ఆహార భద్రత కార్డులున్నాయి. కార్డుదారుల్లో హిందూ సాంప్రదాయాన్ని పాటించే కుటుంబాలు ఎన్ని ఉన్నాయి...? బతుకమ్మ కానుకగా ఎన్ని చీరలు అవసరమవుతాయి...? అనే విషయంపై అధికారులు సర్వేలు జరుపుతున్నారు. అన్ని గ్రామాల్లో ఆహార భద్రత కార్డుల్లో పేరు ఉన్న 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ చీరలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామ స్థాయిలో కమిటీలు...

బతుకమ్మ చీరల పంపిణీ బాధ్యతను గ్రామ స్థాయిలో మహిళా సంఘాలకు అప్పగించారు. పంపిణీని గ్రామస్థాయిలో రేషన్ డీలర్లు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ బాధ్యతను సెర్ప్‌కు, పట్టణ ప్రాంతాల్లో మెప్మాకు అప్పగించారు. జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ పీడీ సమన్వయం చేస్తూ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అదేవిధంగా మున్సిపాలిటీ, నగర పాలక సంస్థల్లో బిల్ కలెక్టర్, మహిళా సంఘం ప్రతినిధి, రేషన్ దుకాణ డీలర్లు పర్యవేక్షిస్తారు. సెప్టెంబర్ నెలలో ప్రారంభమయ్యే బతుకమ్మ ఉత్సవాల నాటికి చీరలను మహిళలకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వచ్చే దసరా నుంచి బతుకమ్మ బహుమతులను మహిళలకు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటుంది. ఈ పథకానికి రూపకల్పన చేసిన మంత్రి కేటీఆర్ కొన్ని రోజులుగా ఈ పథకంపై కసరత్తు చేసి తుది ఆమోదం తెలియజేయడంతో అమలుకు మార్గం సుగమమైంది.

కుటుంబంలో ఎవరైనా తీసుకోవచ్చు

చీరల పంపిణీ సందర్భంలో మహిళలు అందుబాటులో లేకపోయినా ఆ కుటుంబంలోని ఎవరైనా వచ్చి సంబంధిత మహిళ చీరను తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. వచ్చే నెల మొదటి వారంలో సిరిసిల్ల నుంచి చేనేత చీరలు జిల్లా కేంద్రానికి తీసుకు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో సిద్ధం చేసిన రెండు పెద్ద గోడౌన్‌లలో చీరలను నిల్వ ఉంచి అక్కడి నుంచి మండల కేంద్రాలకు తరలించనున్నారు. మండల కేంద్రాల నుంచి రేషన్ దుకాణాలకు చీరలను తీసుకెళ్లి మహిళలకు అందించనున్నారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పర్యవేక్షించనున్నారు.

మండలాల వారీగా బతుకమ్మ చీరల పంపిణీ

వికారాబాద్ 26,188, పరిగి 19,126, తాండూర్ 36,082, బొంరాస్‌పేట్ 18,468, దౌల్తాబాద్ 15,907, కొడంగల్ 16,512, బంట్వారం 6,826, బషీరాబాద్ 13,976, ధారూర్ 12,935, దోమ 15,553, కోట్‌పల్లి 7,604, కుల్కచర్ల 21,820, మర్పల్లి 16,564, మోమిన్‌పేట్ 14,017, నవాబ్‌పేట్ 13,586, పెద్దేముల్ 15,022, పూడూర్ 14,506, యాలాల్ 14,861, మొత్తం 2,99,553

మహిళలకు చీరల పంపిణీకి చర్యలు

పద్మజ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి



జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చేనేత చీరను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా పరిధిలోని 598 రేషన్ దుకాణాల ద్వారా 2,99,553 మందికి చీరల పంపిణీ కొనసాగుతుంది. కుల మతాలకతీతంగా ఆహార భద్రత కార్డుల్లో పేరు ఉండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీరను అందిస్తాం. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పథకాలను రూపొందిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణను ఆదర్శంగా తీసుకోవడం ప్రతి ఒక్కరికి సంతోషదాయకం. అన్ని మతాల వారు వారి పండగల్లో ఆనందంగా గడుపుకునేందుకు ప్రభుత్వం సహాయం చేయడం హర్షణీయం. రంజాన్ పండగకు ముస్లింలకు, క్రిస్మస్ పండగకు క్రైస్తవులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేయడం జరుగుతుంది.

ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు భూముల పరిశీలన

పూడూరు : ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు సంబంధించి బుధవారం రక్షణ శాఖ అధికారులు బుధవారం రాకంచర్ల అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. డీఆర్‌వో సంధ్యా రాణి, ఆర్డీవో విశ్వనాథం, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీలక్ష్మితో కలసి ఆర్మీ అధికారులు ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేయనున్న అటవీ ప్రాంత పరిసరాలను పరిశీలించారు. అటవీ భూమిలో ఉన్న చెట్లను, ఆనుకుని ఉన్న భూముల వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫైరింగ్ రేంజ్ ఏర్పాటులో భాగంగా ఇదివరకే పలుమార్లు ఇక్కడ పర్యటించిన ఆర్మీ అధికారులు బుధవారం మళ్లీ రావడంపట్ల త్వరలో పనులు ప్రారంభం కావచ్చని భావిస్తున్నారు.

'పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలి'

వికారాబాద్ : కంట్రిబ్యూటరీ పింఛన్ పథకం రద్దు చేసి పాత విధానాన్నే అమలుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం(టీపీఆర్ఎంఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.జయప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్ డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు ఉద్యమానికి మద్దతుగా సామూహిక సెలవుకు తమ సంఘం మద్దతు తెలియజేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం ఉమ్మడి రాష్ట్రంలో 2004, సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగ విరమణ అనంతరం లేదా దురదృష్టవశాత్తు విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగి తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీపీఎస్ రద్దు చేసినప్పటి నుంచి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇచ్చిన సామూహిక సెలవు పిలుపునకు మద్దతు తెలియస్తున్నామని తెలిపారు. సీపీఎస్ రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనకు టీపీఆర్ఎం ఉద్యోగులు మద్దతు పలకాలని వారు పిలుపునిచ్చారు. గ్రాట్యూటీ, ఫ్యామిలీ పింఛన్ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో టీపీఆర్ఎంఈఏ పోరాటానికి సిద్ధమవుతుందని వారు స్పష్టం చేశారు.

జిల్లా ప్రజలను మభ్యపెడుతున్న సర్కార్

- డిండి నుంచి మహేశ్వరం, ఇబ్రహీంపట్నంలకు నీరు ఎలా ఇస్తారో స్పష్టం చేయాలి
- నల్గొండ, మల్లన్నసాగర్‌కు నీరు తరలించే కుట్ర
- మాజీ హోంమంత్రి పి. సబితాఇంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ హోంమంత్రి పి.సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం: డిండి ప్రాజెక్టు నుంచి మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు సాగునీరు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మాజీ హోంమంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. కృష్ణా నదిలో నీళ్లు లేనప్పుడు డిండికి నీరు ఎలా వస్తుందని మహేశ్వరం, ఇబ్రహీంపట్నంలకు ఏ విధంగా ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మహేశ్వరం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాలమూర్, రంగారెడ్డి ప్రాజెక్టు ప్రణాళికను ప్రజల ముందు పెట్టాలనారు. 40 వేల కోట్ల టెండర్లను పిలిచినా రంగారెడ్డి జిల్లాలో ఒక్క ఎకరానికైరనా నీరు ఇస్తారా? ఇస్తే అదెలా సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాకు వచ్చే నీరును మల్లన్నసాగర్ నింపుకోవడానికి నల్లగొండకు తరలించడానికి కుట్ర జరిగిందని ఆరోపించారు. డిండి నుంచి మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని ఏయే గ్రామాలకు సాగునీరు అందిస్తారు? ఎక్కడెక్కడా రిజర్వాయర్లు నిర్మిస్తారో ఏయే చెరువులు నింపుతారో ఇక్కడి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రంగారెడ్డి జిల్లా తీవ్రంగా నష్ట పోయిందని మాటల గారడితో ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్ పాలనను ప్రజలు క్షమించే పరిస్థితి లేదన్నారు. ఇంటింటికి తాగునీరందిస్తామని చెప్పి 3 సంవత్సరాలు గడిచిపోతున్నా మహేశ్వరం నియోజకవర్గంలో ఓ ఒక్క గ్రామానికి కూడా కృష్ణానీరు అందిచిన పాపాన పోలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మామీలను అమలుపర్చలేని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు మళ్లీ ఎన్నిలకు సిద్ధమై ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్న విషయాన్ని టీఆర్ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పి.స్నేహాసురేష్, వైస్‌ఎంపీపీ మునగపాటి స్వప్ననవీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎం. శివమూర్తి, పార్టీ నాయకులు ఎం.నవీన్, ఎస్. శ్రీశైలం, మంత్రి రాజేష్, పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే

కఠిన చర్యలు : పీడీ ప్రశాంత్‌కుమార్

యాచారం: హరితహారం కార్యక్రమంతో పాటు నాణ్యమైన పనులు చేయించని పక్షంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా డ్వామా పీడీ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో హరితహారంపై ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమాక్షసమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కింద మొక్కలు నాటడంలో, గుంతలు తవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. పద్ధతి మార్చుకోని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంత దారుణంగా జిల్లాలో ఎక్కడ లేదని సిబ్బందిని మందలించారు. ప్రతి గ్రామంలో విధిగా 40వేల మొక్కలు నాటించాల్సిందేనన్నారు. ఏ ఒక్క గ్రామంలో 10 వేల మొక్కలు నాటలేకపోతే ఎలా అని మందలించారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే మీరెందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించగా ఏ ఒక్కరు కూడా సమాధానం చెప్పలేకపోయారు. సమావేశంలో ఏపీవో కె.నాగభూషణం, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్ రెడ్డి, ఇందిరా క్రాంతి పథం ఏపీఎం రాంరెడ్డి తదితరులున్నారు.

చేతికందని రుణం

- అన్నదాతకు బ్యాంకులు మొండిచేయి
- ఇప్పటికీ 53శాతమే రుణం
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- ఫసల్ బీమా చేసుకోని రైతులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): వ్యవసాయరంగానికి ఊతమిచ్చేందుకు భారీగా రైతులకు రుణాలు ఇస్తున్నామంటూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నా ఆచరణలో మాత్రం జరగడం లేదు. నోట్ల రద్దు తరువాత రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది కనీస స్థాయిలో కూడా రైతులకు రుణాలు అందలేదు. ఖరీఫ్ సీజన్ చివరిదశకు చేరుకున్నా రైతులకు మాత్రం ఇంకా పంట రుణాలు అందలేదు. జిల్లాలో ఈ ఏడాది రైతులకు రూ. 684 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ఖరీఫ్‌లో రూ. 460 కోట్లు, రబీలో రూ. 224 కోట్ల రుణం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇంత వరకు రైతులకు కేవలం రూ. 245 కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చారు. ఇందులో చాల వరకు రీషెడ్యూల్ చేసిన రుణాలే ఉన్నాయి. కొత్తగా రుణాలు ఇచ్చింది చాల తక్కువే. కొత్త రుణాలు, కౌలు రైతులకు రుణాలు కొన్ని మండలాల్లో అసలు ఇంత వరకు ఇవ్వలేదు. ఖరీఫ్ ముగుస్తున్నా ఇంత వరకు రుణాలు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు రుణాల కోసం బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాంకులు కూడా బడా రైతులకే రుణాలు అందచేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి, గ్రామంలో పరపతి కలిగిన రైతులకు మాత్రమే రుణాలు ఇస్తున్నాయి. చిన్న రైతులు, కౌలు రైతులకు ఏదో ఒక సాకు చెప్పి రుణాలు ఇవ్వకుండా తిప్పి పంపుతున్నారు. రైతు రుణాలపై జిల్లా యంత్రాంగం అనేక సమావేశాలు నిర్వహించిన బ్యాంకుల్లో చలనం లేదు. కొన్ని బ్యాంకులు కనీసం 25శాతం కూడా రుణాలు ఇవ్వడం లేదు. అధికారుల ఆదేశాలను ఖాతరు చేయడం లేదు. ఈ విషయంపై కలెక్టర్ ఇప్పటికే బ్యాంకర్లతో పలు మార్లు సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో రైతులకు రుణాలు తక్కువగా ఇవ్వడంపై బ్యాంకర్లను మందలించారు. అయినా కూడా బ్యాంకులు దారికి రావడం లేదు. డిపాజిట్లు తగ్గడంతో రుణాలు ఇవ్వలేక పోతున్నామని బ్యాంకర్లు కొందరు అనధికారికంగా చెబుతున్నారు. నోట్ల రద్దు తరువాత కేంద్రం విధించిన ఆంక్షలు కూడా రుణాల విషయంలో ప్రతిబంధకాలుగా మారాయి. రుణాలు చెల్లించిన రైతులకు కూడా సకాలంలో రుణాలు ఇవ్వలేదు. బ్యాంకుల్లో నగదు నిల్వలేక ఒకే సారి కాకుండా విడతలా వారీగా రుణాలు అందచేశారు. దీని వల్ల రైతులు కూడా ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉంటే రబీలో కూడా రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు సరిగా అందే అవకాశాలు కనిపించడం లేదు. రబీలో రూ.224 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా ఇందులో సగం కూడా ఇస్తారో లేదోనన్న అనుమానాలు కలుగుతున్నాయి.

వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న వైనం

ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో రైతులంతా సంతోషపడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 20శాతం అధికంగా వర్షాలు కురిసాయి. కరువు ప్రాంతాల్లో కూడా ఈ సారి వర్షాలు బాగా కురిసాయి. యచారం, కొందుర్గు, ఇబ్రహీంపట్నం, మాడుగుల, శంషాబాద్ మండలాల్లో 40 నుంచి 50శాతం అధికంగా వర్షాలు కురిశాయి. దీంతో వ్యవసాయ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఎన్నడూ లేని విధంగా పత్తి సాగు 70వేల హెక్టార్లుదాటింది. పంటలు సాగు పెరిగినా రైతులు మాత్రం ఆందోళనతో ఉన్నారు. దీనికి కారణం బ్యాంకుల నుంచి రుణాలు అందకపోవడమే. జీ ఎస్టీ కారణంగా ఎరువుల ధరలు పెరిగాయి. తమ పంటలను కాపాడుకునేందుకు చేతిలో డబ్బులేక చిన్న, సన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు రాకపోవడంతో గత్యంతరం లేక పంటలు వేసేందుకు, వేసిన పంటలు కాపాడుకునేందుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా ఆందోళన తప్పదు

- 'సీపీఎస్'ను రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన
- జిల్లా జేఏసీ చైర్మన్ లక్ష్మణ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): సీపీఎస్‌పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుంటే.. దేశ వ్యాప్తంగా ఆందోళన తప్పదని టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ హెచ్చరించారు కంట్రిబ్యూటరీ (సీపీఎస్) పెన్షన్ పథకం రద్దు చేసి పాత పెన్షన్ (ఓపీఎస్) పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2017న మార్చి ఢిల్లీలో నిరసన తెలిపటం జరిగిందని తెలిపారు. జంతర్ మంతర్ వద్ద పది రోజులు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిరసన తెలిపినా కేంద్రం పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికే 5 వేల మంది ఉద్యోగులు చనిపోయారని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ఎంతో మంది ఉపాధ్యాయ, ఉద్యోగులు పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తునా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజున పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కలెక్టరేట్ వద్ద సామూహిక ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చేనెలా ఒకటో తేదీనా నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులంతా సెలవు పెట్టుకుని పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు విక్టర్, కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింగ్, కార్యదర్శి శ్రీనివాస్, రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు శుక్లకుమార్, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు జ్యోతి, విజయకుమార్, శంకర్, రాజశేఖర్, ఉపాధ్యాయ సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘ నేతలు

'మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలి'



జేసికి వినతి పత్రమిస్తున్న నాయకులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): ఫార్మసిటీ భూసేకరణ పూర్తిగా రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందిని ఫార్మసిటీ 'భూబాధితుల సంఘం' నాయకుడు కిషన్ నాయక్ అరోపించారు. బుధవారం ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో రైతులు జేసి సుందర్ అబ్నార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాధికారులు పట్టాదారు రైతులను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బలవంతంగా భూములు తీసుకునే అధికారం ప్రభుత్వానికి లేదని చెప్పారు. ఫార్మా సిటీలో భూములు కోల్పోతున్న గ్రామాల్లో గ్రామానికి ఒక కిలోమీటరు దూరం నుంచి భూములు తీసుకుంటామని మొదట చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం గ్రామ సరిహద్దు నుంచే భూములను తీసుకుంటుందని ఆరోపించారు. బాధిత రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ సేకరణతో నిరుద్యోగులు, కుల వృత్తుల వారు ఉపాధిని కోల్పోతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పని లేకుండా పోతుందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులు నిరసన తెలిపారు. జేసికి వినతి పత్రం సమర్పించిన వారిలో.. జిల్లా జేఏసీ చైర్మెన్ చెల్మారెడ్డి, జిల్లా నాయకులు రవి, భాష, యాదిరెడ్డి, గణేష్, అచ్చిరెడ్డి, దేవల్‌రెడ్డి, బుచ్చయ్య, సత్యయ్య, కొండల్‌రెడ్డి ఉన్నారు.

'మండల సమాఖ్య ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి'

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): మండల సమాఖ్య ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సెర్ప్‌బార్స్ ఎంప్లాయిస్ రోస్టర్ యూనియన్ అధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మండల స్థాయి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె కొనసాగుతుంది. బుధవారం ఈ సమ్మెకు సెర్ప్‌బార్స్ ఎంప్లాయిస్ రోస్టర్ యూనియన్ ఎంఎంఎస్‌కు మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ, ఎంఎంఎస్ సిబ్బంది డిమాడ్లను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. 15 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి మహిళా సమాఖ్య ఉద్యోగులకు కనీస వేతనాలు అంజేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా రోస్టర్ యూనియన్ కార్యదర్శి ఎం. నాగేష్, ఎంఎస్‌సీసీఎస్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, మండల మహిళా సమాఖ్య సిబ్బంది యూనిన్ అధ్యక్షుడుసుమలత, కార్యదర్శి మల్లేష్, కోషాధికారి ప్రభావతి, ఉపాధ్యక్షుడు అనురాధ, సహాయ కార్యదర్శి బుగ్గరాములు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న మండల సమాఖ్య ఉద్యోగులు

ప్రభుత్వ భూమిని

పరిరక్షించాలని జేసీకి వినతి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): సరూర్‌నగర్ మండలం బహదూర్‌గూడ, సరూర్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 49/13లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గోర శ్యామ్‌సుందర్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన జేసి సుందర్ అబ్నార్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ భూమిని రక్షించాలని ఆయన కోరారు.

నేడు రైతు సమాఖ్య ఏర్పాటుపై రైతు సదస్సు

పెద్దేముల్: రైతు కమిటీల ఏర్పాటు సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు పెద్దేముల్ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం తాండూరు పట్టణంలోని ఎంపీటీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన వివరించారు. సకాలంలో రైతులు హజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

అర్హులైన ప్రతి మహిళకు బతుకమ్మ చీర

● తహసీల్దార్ రాములు

తాండూరు రూరల్: రేషన్ కార్డులో పేరుండి 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని తహసీల్దార్ రాములు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఠాగూర్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్, ఎంపీడీవో జగన్మోహన్‌రావు, ఆయా గ్రామాల డీలర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో బతుకమ్మ చీరల పంపిణీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తుందని, అధికార యంత్రాంగం అర్హులైన వారందరికీ చీరలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన చీరలను ఆయా గ్రామాల డీలర్లు జాగ్రత్తగా పెట్టాలని సూచించారు. డీలర్లంతా బాధ్యతాయుతంగా చీరలు పంపిణీ చేయాలన్నారు. ఎంపీడీవో జగన్మోహన్‌రావు మాట్లాడుతూ వచ్చేనెలా 20 నుంచి 27 వరకు అన్ని గ్రామాల్లో డీలర్లు బాధ్యత తీసుకుని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో పంపిణీ చేయాలన్నారు. పంపిణీకి ముందు ఆయా గ్రామాల డీలర్లు ఒక జాబితా తయారు చేసుకుని దాని ఆధారంగా పంపిణీ చేయాలని సూచించారు. చీరలు పంపిణీ చేసిన ప్రతి మహిళ వద్ద నుంచి యాక్విటెన్సీ తీసుకుని అధికారులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. పట్టణంతోపాటు మండలానికి 36 వేల082 చీరలు మంజూరయ్యాయని, వీటన్నింటినీ బాధ్యతాయుతంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆనంద్, డీలర్లు గాజుల శాంత్‌కుమార్, భీంరెడ్డి, రాకేష్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాములు

డీలర్లమా.. లేబర్లమా..?

బతుకమ్మ చీరలు పంపిణీ చేయడానికి మేము బాండెడ్ లేబర్లమా...డీలర్లమా అంటూ తహసీల్దార్ రాములును మండల డీలర్ల సంఘం ప్రతినిధి బంటారం మల్లేశం ప్రశ్నించారు. ప్రభుత్వం తమకు చీరలు పంపిణీ చేయడానికి ఆంక్షలు పెట్టిందని, అసలు మా బతుకులు లేబర్ల కంటే అధ్వానమయ్యాయని మండిపడ్డారు. అధికారులు రాతపూర్వకంగా ఆదేశాలివ్వాలని, ఇలా సమావేశం ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని చెబితే ఎలా అంటూ ఆగ్రహించారు. ఇందుకు తహసీల్దార్ రాములు స్పందిస్తూ కలెక్టర్ ఆదేశాలున్నాయని, డీలర్లంతా ఖచ్చితంగా ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చీరలు పంపిణీ చేయాల్సిందేనని అన్నారు. అయినప్పటికీ సమావేశంలో డీలర్ల సంఘం ప్రతినిధికి మద్దతుగా మరికొందరు డీలర్లు పైకిలేసి ప్రభుత్వ ఆదేశాలు చూపించాలంటూ ఒక్కసారిగా ప్రశ్నించడంతో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. మేము డీలర్లమా...లేబర్లమా అంటూ ఆగ్రహించారు.

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: బతుకమ్మ చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నందున అర్హులైన మహిళలందరికీ అందేలా చూడాలని ఆ దిశగా డీలర్లు ఆధార్ జిరాక్స్ ప్రతులను సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని సర్పంచ్ జయమ్మ అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో అర్హులైన ప్రతి మహిళకు చీరలు ప్రభుత్వం ఇస్తున్నందున అందరూ సద్వినియోగం చేసుకునేలా డీలర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పంచాయతీ సిబ్బంది సహాయ సహకారాలు తీసుకుని, అందరికీ చీరలు అందేలా సమన్వయంతో పనిచేయాలన్నారు.

సీడ్ బాల్స్‌తో మొక్కల పెంపకం


సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న విద్యార్థులు

● మొక్కల పెంపకంలో కొత్త టెక్నాలజీ
● తగ్గనున్న శ్రమ, ఖర్చు...
● కూలీలు లేకుండానే మొక్కల పెంపకం

యాలాల: హరితహారంలో భాగంగా నర్సరీల్లో మొక్కలను పెంచి వాటిని గ్రామాల్లో నాటడం చూశాం...చూస్తున్నాం...ఇందుకు పెద్ద ఎత్తున కూలీల శ్రమతోపాటు నిధులు కూడా అవసరమయ్యేవి. అధికారులు ఈ సారి ఆ పద్ధతిన కాకుండా సీడ్‌బాల్స్ పద్ధతిన మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టి పలువురిచే అవురా అనిపించుకుంటున్నారు. యాలాల మండలంలో సుమారు 3లక్షల సీడ్‌బాల్‌ను తయారు చేసి ఇప్పటికే రాస్నం, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లోని అటవీ ప్రాంతాలన్నింటినీ విసిరేసారు. సీడ్ బాల్స్ తయారీకి ఓ విత్తనాన్ని తీసుకుని దాని చుట్టూ ఎరువులతో కూడిన మట్టిని నీటిలో తడిపి విత్తనాన్ని మట్టి ముద్దగా మారుస్తారు. ఆ ముద్దను మూడు, నాలుగు రోజులపాటు ఎండలో ఆరబెడతారు. ఆరబెట్టిన ఈ సీడ్ బాల్స్‌ను మనుషులు వెళ్లని చోట కానీ, ఎక్కడైనా కానీ విసిరేస్తే వర్షం కురియగానే ఆ సీడ్‌బాల్స్‌లోని విత్తనం మొలకెత్తుతుందని అధికారులు పేర్కొంటున్నారు. నాలుగు రోజుల క్రితం మండలంలోని రాస్నం, తిమ్మాయిపల్లి గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో యాలాల కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన ఈ సీడ్‌బాల్స్‌ను విసిరేసారు. సీడ్‌బాల్స్‌ను తయారు చేయడం వల్ల అటు కూలీల శ్రమ, ఎలాంటి డబ్బులు అవసరం లేకుండా వీటిని ఎక్కడైనా విసిరితే అవి మొలకెత్తుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పద్ధతిన మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ వర్షాకాలంలో సీడ్‌బాల్స్ పంపించి వాటిని విసిరేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ సాయన్నగౌడ్, ఎంపీడీవో సుధాకర్ పేర్కొన్నారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల సామూహిక సెలవు

తాండూరు రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు సామూహికంగా సెప్టెంబర్ 1న సెలవు పెట్టారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ నెంబర్-1 పాఠశాలలో ఎంఈవో వెంకటయ్యగౌడ్‌కు సెలవు పత్రాలను అందజేశారు. ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు నర్సిరెడ్డి, నాగప్ప, ఆనంద్, జైపాల్‌రెడ్డి, మొగులప్ప, మనోహర్, శ్రీనివాస్ ఉన్నారు.

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: సీపీఎస్ రద్దుకు సెప్టెంబర్ 1న వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే సామూహిక దీక్షా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మండల పీఆర్టీయూ, టీఎస్‌సీపీఎస్ఈఏ సంఘాల నాయకులు రవికాంత్, మునావీర్‌లు పిలుపునిచ్చారు. ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాల(బాలుర)లో సామూహిక సెలవు పత్రాలను ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు నర్సప్పకు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, నాగరాజు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవోకు సెలవు పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్: ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బషీరాబాద్ ఎంపీడీవో శెట్టి రవికుమార్ తెలిపారు. మండలానికి 37 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. బ్యాంకుల వారీగా యూనిట్ల మంజూరు వివరాలిలా ఉన్నాయి. ఎస్‌బీఐ బషీరాబాద్ బ్యాంకుకు 7 యూనిట్లు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు బషీరాబాద్ 17 యూనిట్లు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు తాండూరుకు 14 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. రుణాలు పొందేందుకు 21 నుంచి 50ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ రైతులు అయితే 60ఏళ్ల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డుతోపాటు కులం, ఆదాయం, నివాస పత్రాలు దరఖాస్తుతోపాటు సమర్పించాలన్నారు. అర్హులైనవారు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

తాండూరు రూరల్: తాండూరు మండల పరిధిలోని కరన్‌కోట్ అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి గురువారం తనిఖీ చేశారు. కొన్ని కేంద్రాల్లో సరుకులు తక్కువగా ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. వీటిపై త్వరలోనే ఆయా కేంద్రాల కార్యకర్తలకు మెమో ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ మొదటి కేంద్రంలో 14 ప్యాకెట్ల బాలామృతం, 7ప్యాకెట్ల నూనె, 134 గుడ్లు, ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో 3ప్యాకెట్ల బాలామృతం, 286 గుడ్లు, 6వ కేంద్రంలో 626 గుడ్లు, 14 ప్యాకెట్ల బాలామృతం, 4ప్యాకెట్ల నూనె తక్కువగా వచ్చిందని, ఈ విషయంపై కార్యకర్తలను ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేదన్నారు. వారికి చార్జి మెమో ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అంతారంలోని రెండు కేంద్రాల్లో పనిచేయని కార్యకర్తలకు కూడా చార్జీ మెమో ఇచ్చారు.

'ఉద్యమకారులకు న్యాయం జరగలేదు'


అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఉద్యమకారులు

తాండూరు రూరల్: పట్టణంలోని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న టీఆర్ఎస్ కార్యకర్తలకు న్యాయం జరగలేదని ఉద్యమకారుడు వెంకటేష్‌చారి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి 8 గంటలకు అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తింపు ఇవ్వలేదని, దీంతో కొందరు మనస్థాపానికి గురవుతున్నారన్నారు. అయ్యూబ్‌ఖాన్ విషయంలో కూడా అదే జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు పదవులు కట్టబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు భాను, నాగేందర్‌గౌడ్, మోయిజ్, దత్తాత్రేయ తదితరులున్నారు.

లారీ పార్కింగ్ వద్ద..

తాండూరు: పట్టణంలోని లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంత మంది యువకులు నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతోనే టీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్ ఆత్మహత్యాయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ కార్యకర్తలు పోరాటాలు చేసి, పార్టీ కోసం పనిచేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో లారీ పార్కింగ్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇప్పటికైనా కార్యకర్తలు, ఉద్యమకారులకు పదువులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు టీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

యాలాల: తాండూరు నియోజకవర్గ టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిద్రాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డె రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునితారెడ్డి హాజరవుతున్నారని అన్నారు. అందుకు మండలంలోని వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు తప్పని సరిహారు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు

● ఇళ్లపైన వేలాడుతున్న తీగలు
● ఆందోళనలో ఇంటి యజమానులు


ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్


ఇంటి మధ్యలో ఉన్న స్తంభం

షాద్‌నగర్ అర్బన్ : మండల పరిధిలోని బుచ్చిగూడ గ్రామంలో ఇళ్లపై ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏవిధంగా ప్రమాదం సంభవిస్తుందోనని ఇంటి యజమానులు భయంగా కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలోని కారాటి బాబయ్య నుంచి హనుమాన్ దేవాలయం వరకు ఉన్న స్తంభాలన్నీ కొన్ని ఇంటి పరిసరాల్లో మరికొన్ని ఇళ్లమధ్యలో ఉంటడంతో ప్రమాదకరంగా మారాయని గ్రామస్థులు తెలిపారు. గతంలో బుచ్చిగూడ గ్రామ శివారులో వెలసిన సోలార్ పవర్‌ప్లాంటు నుంచి వెంకటేశ్వర హేచరీస్ వద్ద గల సబ్‌స్టేషన్ వరకు స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇళ్లమధ్యలో స్తంభాల వద్ద గ్రామస్థులు అడ్డుకున్నట్లు వివరించారు. అప్పటి రూరల్ విద్యుత్ ఏఈ ఇళ్లమధ్యలోని స్తంభాలను తొలగించి పవర్‌ప్లాంటుకు వెళ్లే స్తంభాలకు వైర్లను అమర్చుతామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు స్తంభాలను పాతేందుకు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. కాని దాదాపు రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా... నేటికి విద్యుత్ లైన్ మార్పిడి చేయలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒకసారి విద్యుత్ వైర్లు తెగిపడి స్కూల్ పరిసరాల్లో పడ్డాయని, ఆరోజు స్కూల్ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాల పైభాగం నుంచి కూడా విద్యుత్ లైన్ వెళ్తుందని స్కూల్లో పాతిన స్తంభం శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. ఇలా గ్రామంలోని వివిధ కాలనీలకు వెళ్లే రోడ్డు వెంబడి కూడా వైర్లు వేలాడుతున్నాయని, భారీ వర్షం, ఈదురుగాలులు వీచినప్పుడు పలు రకాల సమస్యలు వస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన ప్రమాదకరంగా ఉన్న లైన్లను తొలగించాలని గ్రామంలోని వైర్లను సరిచేయాలని కోరుతున్నారు.

ఇంటి మధ్యలోని స్తంభం తొలగించాలి



ఇంటి మధ్యలో స్తంభం తొలగించాలి. గాలులు వీచినప్పుడు భయంగా ఉంటుంది. చాలా రోజుల నుంచి అడుగుతున్నాం. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. వైర్లను తొలగించి పెద్ద స్తంభాల పైకి మార్చాలి.

-కారాటి మాణమ్మ, బుచ్చిగూడ

ఇంటిపైకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది



మా ఇంటి పైనుంచి వెళ్లే విద్యుత్ లైన్ సంవత్సరాలుగా అలాగే కొనసాగుతుంది. ఇంట్లో ఏదైనా కార్యక్రమం నిర్వహించినప్పుడు ఇబ్బందిగా ఉంది. మా పిల్లలు ఇంటి పైకి వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ లైన్ తొలగించాలి.


- పోచయ్య, రైతు, బుచ్చిగూడ

పాఠశాలపై ఉన్న వైర్లను తొలగించాలి



స్కూల్ పైభాగాన ఉండే వైర్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. స్కూల్ వెనకాల స్తంభం, పైనుంచి వైర్లు, గేట్ ముందర నుంచి వైర్లు ఇలా పాఠశాల చుట్టు విద్యుత్ వైర్లే, అనవసరంగా చెట్లను నరకాల్సి వస్తుంది. గతంలో ఒకసారి వైర్లు తెగిపడ్డాయి. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వైర్లను తొలగించాలి.

- యాదయ్య, ప్రధానోపాధ్యాయుడు, బుచ్చిగూడ



● త్వరలో రానున్న మీటర్లు
● ముందు డబ్బు చెల్లిస్తేనే విద్యుత్
● మొండి బకాయిలకు చెక్ పెట్టేందుకు చర్యలు
● ఈ విధానం అమలుకు ప్రభుత్వం కసరత్తు
● సిబ్బందికి తప్పనున్న అవస్థలు
● పెరగనున్న ఆదాయం

కరెంట్.. ప్రీపెయిడ్

బషీరాబాద్ : విద్యుత్ సరఫరాకు ప్రీపెయిడ్ మీటర్ల విధానం అమలుచేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో గత ఏడాదిగా ప్రక్రియ అమలుకు ఆ శాఖ అధికారులు ప్రీపెయిడ్ మీటర్లపై అధ్యయనం జరిపి సాధ్య అసాధ్యలను పరిశీలించి ఓ కొలిక్కి తెచ్చినట్లు తెలుస్తోంది. ఈ విధానం అమలుతో త్వరలోనే ప్రస్తుతం ఉన్న మీటర్లన్నీ ప్రీపెయిడ్ మీటర్లుగా మారిపోనున్నాయి. ఈ విధానం అమల్లోకివస్తే సెల్ ఫోన్, టీవీ డిష్‌ల మాదిరిగా ముందే డబ్బు చెల్లించి ఎలా రీచార్జ్ చేసుకుంటామో ఆ విధంగా విద్యుత్‌ను కూడా వినియోగదారుడు అవసరం మేరకు డబ్బులు చెల్లించి రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రీపెయిడ్ మీటర్లను ముందుగా ప్రభుత్వ కార్యాలయల్లో అమలుపర్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రీపెయిడ్ విధానాన్ని త్వరలో విద్యుత్ శాఖ అమలుపర్చే యోచనలో ఉన్నట్లు ఆ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు.

ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తే..

ప్రీపెయిడ్ విధానం అమల్లోకివస్తే విద్యుత్ మొండిబకాయిలకు చెక్ పడనుంది. విద్యుత్ శాఖలో ప్రతియేటా విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. నెలనెల ఆ శాఖ సిబ్బంది బిల్లుల వసూళ్లకు తిరుగుతున్నా బకాయిలు రూ. కోట్లల్లోకి పెరుగుతూనే ఉన్నాయి. విద్యుత్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ, స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, కరెంట్ సరఫరా నిలిపివేసి వసూళ్లను చేపడుతున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు కానరావడం లేదు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు వసూళ్ల లక్ష్యం పూర్తికాక నెలనెల అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా విద్యుత్ సరఫరా కూడా టార్గెట్‌కు మించి వినియోగంతోపాటు భారీగా దుర్వినియోగమవుతోంది. ఇలాంటి వన్నీ అరికట్టడానికి విద్యుత్‌శాఖ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు యోచిస్తుంది. ఈ విధానం అమలుతో మొండి బకాయిల వసూళ్ల లక్ష్యం నెరవేరడంతోపాటు నెలనెల బిల్లులు కూడా వందశాతం వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

డబ్బులుంటేనే విద్యుత్ సరఫరా..

విద్యుత్ శాఖ అధికారులు ప్రస్తుతం ఉన్నా మీటర్ల స్థానంలో ప్రీపెయిడ్ మీటర్లను అమర్చనున్నారు. వినియోగదారుడు నెలవారీగా ఎంత విద్యుత్ అవసరమవుతుందో యూనిట్లకు తగ్గ డబ్బులు ముందుగా చెల్లించి రీచార్జి చేసుకోవాలి. దీంతో చెల్లించిన డబ్బుల ఆధారంగా యూనిట్ల మేరకు కరెంట్ అందుతుంది. ఆ తర్వాత విద్యుత్ సరఫరా ఆటోమెటిక్‌గా నిలిచిపోతుంది. వెంటనే మళ్లీ వినియోగదారుడు డబ్బులు చెల్లించి రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల విద్యుత్ నివారణతోపాటు వినియోగదారులు కూడా అనవసరంగా కరెంట్ వినియెగించకుండా పొదుపు విధానం అవలంభిస్తారని ఆ శాఖ అధికారులు ఆలోచిస్తున్నారు. ఏదేమైనా బిల్లుల వసూళ్లకు సిబ్బంది ఇళ్లచుట్టూ, విద్యుత్ కార్యాలయల చుట్టూ వినియోగదారులు తిరిగే ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

గులాబీ కోటలో కలకలం

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

తెలంగాణ ఉద్యమంలో ఎంతో కష్టపడ్డా ఏ పదవి దక్కలేదని ఆవేదనతో తాండూరు పట్టణ మాజీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం టీఆర్ఎస్ వర్గాల్లో కలకలం రేపింది. తాండూరులో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో చోటుచేసుకున్న ఈ ఉదంతం గులాబీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం. తెలంగాణ సాధన ఉద్యమంలో పాల్గొన్న ఎంతో మంది టీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తమకు ఏదైనా గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందని ఎంతో ఆశపడ్డారు. అయితే నామినేటెడ్ పదవుల పందేరంలో ఉద్యమకారులకు ఆశించిన స్థానంలో న్యాయం జరగకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచిపోయినా ఇంకా పదవులు దక్కకపోవడంతో ఆశావహుల్లో నిర్వేదం వ్యక్తమవుతోంది. ఏదైనా నామినేటెడ్ పదవి రాకపోతుందా అంటూ ఇంతకాలం గంపెడాశతో ఉన్న ఉద్యమకారులు, పార్టీ నాయకులు క్రమంగా తమ ఆశలు వదులుకుంటున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోలీసుల లాఠీ దెబ్బలు తిని.., కేసుల పాలై... జైలు ఊచలు లెక్కపెట్టిన ఉద్యమ నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలనే డిమాండ్ సీఎం వరకు వెళ్లేలా చేశారు. నామినేటెడ్ పదవుల భర్తీలో ఉద్యమ నాయకులకు అవకాశం కల్పించాలని పలుమార్లు సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, ఎంపీ కవిత, మంత్రి మహేందర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోరాటం చేసిన పార్టీ



నేతలు పలువురు నామినేటెడ్ పదవుల కోసం గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.. ఈ పదవుల భర్తీ విషయంలో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, మహేందర్‌రెడ్డిలపైనే జిల్లా నేతలు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రం ఆవిర్భవించి మూడేళ్లు దాటినా ఇంకా నామినేటెడ్ పదవుల పందేరం పూర్తి కాలేదు. పదవులు భర్తీ చేసే సమయంలో ఉద్యమకారులకు తప్పకుండా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ... ఆచరణలో మాత్రం అమలుకాక పోవడం పార్టీ వర్గాలను ఆవేదనకు గురిచేస్తోంది. స్వరాష్ట్రంలో నామినేటెడ్ పదవుల్లో కొనసాగాన్న ఆకాంక్షను సాకారం చేసుకునేందుకు ఆశావాహులు తమ ప్రయత్నాలు తీవ్రంగా చేసినా ఫలితం లేకపోవడంతో క్రమంగా పదవులపై తమ ఆశలు వదిలేసుకుంటున్నారు.

నామినేటెడ్ పదవులు దక్కక నిర్వేదం

ఆవిర్భావం నుంచి కష్టపడి ఉద్యమంలో పాల్గొన్న నేతలకు నామినేటెడ్ పదవుల్లో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉద్యమ జెండాలను మోసిన వారికి ప్రాధాన్యత ఇవ్వలేదనే ఆవేదన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండళ్లు పూర్తి స్థాయిలో నియామకం పూర్తి చేసిన పాలకులు జిల్లాలో కొన్ని దేవాలయాల పాలకమండళ్ల నియామకం చేపట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పాలక మండలిని ప్రకటించి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులు జారీ చేయలేదు. నియామకమైన గ్రంథాలయ సంస్థ పాలక మండలి సభ్యులు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. భర్తీ కాకుండా మిగిలిన నామినేటెడ్ పదవులపైన ఎటూ తేల్చకపోవడం పట్ల కూడా పార్టీ వర్గాల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ఉద్యమంలో పోలీసు లాఠీ దెబ్బలు తిని కేసులతో జైళ్లకు వెళ్లిన వారికి నామినేటెడ్ పదవులు వరించకపోవడం పార్టీ కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది. నామినేటెడ్ పదవుల పందేరంలో పార్టీకి చెందిన ఉద్యమ నాయకులకు ఇప్పటికైనా న్యాయం జరగకపోతే మాత్రం ఆ అసంతృప్తి పార్టీపైన తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. బుధవారం తాండూరులో చోటుచేసుకున్న అయూబ్‌ఖాన్ ఉదంతమే ఇందుకు తాజా ఉదాహరణ.


టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులు

అయ్యూబ్‌ఖాన్ ఆత్మహత్యాయత్నానికి నిరసనగా రాస్తారోకో

ధారూరు : తాండూరు పట్టణ టీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్ బుధవారం సాయంత్రం మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంపై నిరసన వ్యక్తంచేస్తూ బుధవారం రాత్రి ధారూరు మండల కేంద్రంలో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ధారూరు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు, మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ అనుచరుడు ఎస్‌కే ఆశమ్ ఆధ్వర్యంలో కొంతమంది తాండూర్-వికారాబాద్ రోడ్డుపై అంబేద్కర్ చౌరస్తా వద్ద టైర్లను కాల్చి రాస్తారోకో నిర్వహించారు. ఎస్‌కే ఆశమ్‌తోపాటు మరికొంతమంది ఆయన మద్దతుదారులు కేసీఆర్ డౌన్ డౌన్ టీఆర్ఎస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ నినాదాలుచేస్తూ రోడ్డుపై వాహనాలను నిలిపివేసారు. టీఆర్ఎస్ పార్టీలో 2004లో అయ్యూబ్‌ఖాన్‌తో కలిసి పనిచేసామని టీఆర్ఎస్ పార్టీలో పనిచేసిన నాయకులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పదవులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఎస్‌కే ఆశమ్ ఆరోపించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



- రేపటి నుంచి పోషకాహార వారోత్సవాలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- పౌష్టికాహార లోపంతో ఏటా వేలాది మంది చిన్నారుల మృత్యువాత

దేశంలో పోషకాహార లోపంతో ఏటా 50 శాతం మంది పిల్లలు, రక్త హీనతతో 85 వేల మంది గర్భిణులు, బాలింతలు మృతి చెందుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయోడిన్ లోపంతో 90 శాతం మంది శిశువులు జన్మిస్తున్నారు. ఈ సమస్యలన్నింటికీ ప్రధాన కారణం పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోకపోవడమే. పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సెప్టెంబరు 1నుంచి 7 వరకు పోషకాహార వారోత్సవాలను నిర్వహిస్తోంది. పౌష్టికాహారం విలువలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. - వికారాబాద్ (ఫీచర్స్)

లోపాన్ని గుర్తించడం..

సాధారణంగా ఎత్తు, బరువే పిల్లల ఆరోగ్య సూచికగా చెప్పవచ్చు. ఎందుకంటే ఎత్తు, బరువుల ఆధారంగా పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారా, లేదా సులభంగా తెలుసుకోవచ్చు. 4 నుంచి ఆరేళ్ల లోపు వయసు గల ఆరోగ్యవంతమైన పిల్లలు 20కిలోల బరువుండాలి. ఆరేళ్ల బాలిక 118 సెం.మీ, బాలుడు 119 సెం.మీ పొడవును కలిగి ఉండాలి.

ఇలా చేయడం ఆరోగ్యకరం

పిల్లలకు మాంసకృత్తుల కోసం మాంసానికి బదులుగా కాయగూరలు ఎక్కువగా తినిపించడం మంచిది. స్థానికంగా దొరికే అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు, సీజనల్ పండ్లను తప్పనిసరిగా తినాలి. సులభంగా జీర్ణమయ్యే పదార్థాలను తినడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

బాల్యదశలో పౌష్టికాహారం తప్పనిసరి

ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యదశ అత్యంత కీలకమైనది. ముఖ్యంగా మానవ మెదడు ఐదేళ్ల వయసులోపే వృద్ధి చెందుతుంది. సమాజానికి ఆరోగ్యవంతమైన పిల్లలను అందించడంపైనే భావిభారత నిర్మాణం ఆధారపడి ఉంటుంది. ఇందుకోసం చిన్నతనం లోనే పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం ఎంతో అవసరం. సమపాళ్లలో సంతులిత ఆహారం అందించడంతో ఆరోగ్యవంతంగా తయారవుతారు.



తలెత్తే సమస్యలు

పౌష్టికాహార లోపం వల్ల పిల్లల్లో అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఏ-విటమిన్ లోపం వల్ల కంటిచూపు మందగిస్తుంది. మాంసకృత్తులు, కొవ్వు పదార్థాల లోపం వల్ల సన్నబడడం, పొడవు పెరగకపోవడం, బుద్ధి మాంద్యం, మానసిక పరిపక్వత లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఐరన్ లోపం వల్ల రక్త హీనతతో పాటు జ్ఞాపక శక్తి నశిస్తుంది. క్యాల్షియం లోపం వల్ల ఎముకల పటుత్వం తగ్గి అవి బలహీనంగా తయారవుతాయి.

యవ్వన దశలో సంతులిత ఆహారం అత్యంత ఆవశ్యకం

11 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు గల బాల, బాలికలకు(యవ్వన దశ) సంతులిత ఆహారం ఎంతో అవసరం. ఈ వయసులో హార్మోన్ల మార్పులు, లైంగిక పరిపక్వత, భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలోనే పిల్లలు బరువు ఎక్కువగా పెరుగుతారు. కాబట్టి వారికి పౌష్టికాహారం అత్యావశ్యకం. ఎముకల గట్టితనానికి, పెరుగుదలకు అవసరమైన క్యాల్షియం వారికి చాలా అవసరం.

అందువల్ల క్యాల్షియంతో పాటు ఐరన్, మాంసకృత్తులు ఎక్కువగా ఉండే చిక్కుళ్లు, పాలు, గ్రుడ్లు, పప్పులు, ఆకుకూరలు, కాయగూరలు, బెల్లం, రాగులు, కందులు, సీజనల్ పండ్లు రోజూవారీ ఆహారంతో పాటుగా అందివ్వాలి.

4నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం

పోషక విలువలు	లభించే పదార్థం
కాలరీలు	చిరు ధాన్యాలు, పప్పులు
మాంసకృత్తులు	పాలు, గ్రుడ్లు, మాంసం, చేపలు
కొవ్వు పదార్థాలు	నూనెలు, వెన్న, నెయ్యి
క్యాల్షియం	పాలు, గింజలు, రాగులు, ఆకుకూరలు
ఐరన్	మునగ, పాలకూర, మెంతి, కొత్తిమీర
విటమిన్-ఏ	క్యారెట్, పసుపు, గుమ్మడి, మామిడి, బొప్పాయి



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాల ర్యాలీ (ఫైల్)

యవ్వన దశలో తీసుకోవాల్సిన ఆహార పరిమాణం (గ్రాముల్లో)

పదార్థం	బాలురు	బాలికలు
బియ్యం, గోధుమలు, సజ్జలు, రాగులు	420	300
పెసర, కంది, శనగ, మినప పప్పు	60	60
పాలు, పాల ఉత్పత్తులు	500	500
ఆలు, చామ, క్యారెట్, కంద, చిలగడ దుంప	100	100
ఆకుకూరలు	100	100
కూరగాయలు	100	100
పండ్లు	100	100
చక్కెర, బెల్లం	35	30
నూనెలు	25	25



ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి

పిల్లల సంపూర్ణ శారీరక, మానసిక వికాసానికి పోషకాహారం అత్యంత ఆవశ్యకం. దేశంలో ఏటా వేలాది మంది చిన్నారులు పౌష్టికాహార లోపంతో మృతి చెందుతున్నారు. దీనిని అరికట్టాలంటే పిల్లలకు పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించడం ఒక్కటే మార్గం. అందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోంది. స్థానికంగా దొరికే ఆకుకూరలు, కాయగూరలు. పండ్లను ఎక్కువగా తినడం వల్ల పౌష్టికాహార సమస్య తలెత్తకుండా చూడవచ్చు.

-జ్యోత్స్న, స్త్రీ, శిశు సంక్షేమ అధికారి

దత్తత ఇక చట్టబద్ధత

- చిన్నారుల దత్తత ఇక నుంచి చట్టం ప్రకారం
- దత్తత తీసుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

యాచారం: అమ్మ పొత్తిళ్లలో నిద్రిస్తూ తల్లిస్పర్శతో తలదాచుకునే ప్రాయంలో పసికందులు ఆ ప్రేమకు దంపతులు పేగు తెంచుకొని పుట్టకున్నా పాలుగారే ఆ ప్రాయాన్ని తమ సర్వస్వంగా భావించారు. ఆవాత్సల్యంలో తామూ అంతులేని ఆప్యాయతాను సొంతం చేసుకుంటున్నారు. వారసులు లేని దంపతులకు తల్లిదండ్రులనే గౌరవాన్ని అనాథలైన పిల్లలకు అందరిని అందించే ఏకైక మార్గం దత్తత. ఎంత ప్రేమను పంచినా లాభం లేదంటుంది. రహస్యంగా పిల్లలను విక్రయించిన ఉదంతాల్లో బాధ్యులను గుర్తించి కఠినంగా వ్యవహారించింది.

మంథన్‌గౌరెల్లిలో దంపతులకు నలుగురు ఆడపిల్లలుండడంతో ఓ కూతురును దేవరకొండకు చెందిన ఓ యువకుడు కొన్నారు. నల్లవెల్లి తండాకు చెందిన మహిళకు ఇరువురు కుమార్తెలుండడంతో మూడో బిడ్డ పుట్టడంతో శిషువిహార్ అందించారు.


ఆడబిడ్డను అంగన్‌వాడీ అధికారులకు అప్పగిస్తున్న నల్లవెల్లి తండాకు చెందిన ఓ యువతి (ఫైల్)

నిబంధనలు ఇలా..

చట్టం ప్రకారంగా దత్తత తీసుకుంటే సమస్యలనేవి ఉండవు. ఈ విషయంలో ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉండడం, సమాజంలో విషయం తెలియకూడదనే భావనతో కొందరు సమస్య కొని తెచ్చుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం 2017 జనవరి 16న దత్తత స్వీకరణ విషయంలో నూతన మార్గదర్శకాలు వెలువరించింది. మహిళాభివృద్ధి శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ పర్య వేక్షణలో నిబంధనలు ప్రవేశ పెట్టింది. దత్తత తీసుకునే దంపతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రాజెక్టు డైరక్టర్ డీడబ్ల్యూసీ ఎస్, పేరుతో 6000 రూపాయలకు డీడీ తీసి సంబందిత శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలి. నెల వ్యవధి లోపు అధికారులు హోమ్‌స్టడీ రిపోర్ట్ తయారు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హెచ్‌ఎస్‌ఆర్ (హోమ్‌స్టడీ రిపోర్ట్)తయారు చేసిన నాటి నుంచి దరఖా స్తుదారులు జాబితాలో ఉంటారు. మనకు ఇచ్చిన నమోదు క్రమం ఆధారంగా సీనియార్టీ కల్పిస్తారు. ఈ వివరాలు మెసేజ్ ద్వారా ధరఖాస్తుదారుల ఫోన్‌కు మేసేజ్ వస్తుంది. ఆ తరువాత 48 గంటలలోగా శిశువులను ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకోవాలి. ఇదే సమయంలో స్పందింస్తే దంపతులు సీనియార్టీ కోల్పోతారు. దంపతులు రిజర్వ్ చేసుకున్నట్లయితే 20 రోజుల లోపు నిర్దేశించిన ఏజెన్సీకి వెళ్లి డాక్యుమెంట్లు అందించాల్సి ఉంటుంది. 40వేల డీడీ అందించాల్సి ఉంటుంది. అనంతరం శిశువును అందిస్తారు. తరువాత ఫ్యామిలీ కోర్టునుంచి లీగలైజేషన్ ఉత్తర్వులు వచ్చేవరకు వేచి ఉండాలి. దత్తత తీసుకున్న రోజు నుంచి ఆరు నెలలకొసారి శిశుసంక్షేమశాఖ అధికారులు విచారణ చేస్తారు. విచారణ చేసిన రిపోర్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేస్తారు.



పసికందులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయి

దత్తత రెండో జన్మలాంటిది. ఎవరైతే కనీస సదుపాయలు కల్పించి పెంచుతారో వారికి శిశువిహార్ నుంచి దత్తత ఇస్తారు. సంతానం లేని వారికి కూడా ఇస్తాం. దత్తత తీసుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారు ఏరాష్ట్రం నుంచి కావాలి. ఏజిల్లా నుంచి కావాలో అడిగి ఇస్తారు. ఆన్‌లైన్‌లో ఆప్షన్ పెట్టుకోవాలి.

- శాంతిశ్రీ, ఇబ్రహీంపట్నం డివిజన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి



55 ఏళ్లు నిండిన వారు అనర్హులు

దంపతులు ఇద్దరి వయస్సు సుమారుగ 40 ఏళ్లుండాలి.

దంపతులిరువురు ఆరోగ్యంగా ఉండాలి. నయంకాని రోగాలుండరాదు. పిల్లలు పుట్టరని డాక్టర్ చేత ధ్రువీకరణ పత్రం పొంది ఉండాలి.

అప్‌లోడ్ చేయాల్సినవి

దత్తత తీసుకోవాలనుకునే దంపతుల ఫొటోలు, వయస్సు, ధ్రువీకరణ పత్రం, ఇంటి చిరునామా, ఆదాయ ధ్రువపత్రం, ఇద్దరికి కలిపి సుమారుగా ఏడాదికి లక్ష రూపాయలకు తక్కువ ఉండకూడదు. సర్కార్ ఉద్యోగులైతే వేతన ధ్రువీకరణ పత్రం. కులం, ఆదాయ, రిజిస్ట్రేషన్ కార్డు నెంబర్, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు ఆన్‌లైన్ చేసే అధికారికి అందించాలి.

సంతానం లేని వారికి మొదటి ప్రాధాన్యం

సంతానం కలగలేదని బాదపడుకుండ ఉండాలంటే పిల్లలను దత్తత తీసుకోవాలి. దంపతులు ఇద్దరు ఆరోగ్యంగా ఉండాలి. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి దత్తత ఇవ్వరు. సంతానం కలగరని వైద్యులు ధ్రువీకరణ పత్రం ఉంటేనే పిల్లలను దత్తత ఇస్తారు.

'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)

2. చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?
ఎ) చెన్‌లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్(ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్(డెన్మార్క్)

3. పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియాన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్(స్పెయిన్)

4. ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)

5. ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా

6. భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్

7. ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'నంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్

8. తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజేరి

9. అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్

10. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?

ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా

11. జాతీయ క్రీడా దినోత్సవం?
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30

12. ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ

13. 101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనందసేన్ గుప్తా ఎవరు?
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత

